

Follow: @ANNTELUGU
22-09-2025
# మహా పత్రిక
ANN తెలుగు
సోమవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 187 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

టాప్ న్యూస్



### భారత్-పాక్ యుద్ధం ఆపింది నేనే..
- నాకు నోబెల్ ఇవ్వాలి
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

02



### తెలంగాణలో జెన్ జెడ్ వల్లే...
- బీఆర్ఎస్‌కు సున్నా సీట్లు
- కేటీఆర్ కు కేంద్ర మంత్రి బండి సంజయ్ కౌంటర్

02



### ఓజీ.. ఫీవర్
- ఒక్క టికెట్ రూ.1.50 లక్షలు
- తెలుగురాష్ట్రాల్లో సంచలనం

02



## రాష్ట్రమంతా పూల పండుగ శోభ
**వేయి స్తంభాల గుడిలో వైభవంగా బతుకమ్మ ఉత్సవాలు**

భట్టి , పొంగులేటి , జూపల్లి కృష్ణారావు, సీతక్క, సురేఖ హాజరు

చిన్న పెద్ద అందరినీ ఆకట్టుకున్న అలంకరించిన బతుకమ్మలు

బతుకమ్మ పాటలు, దశావతార నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకల్లో సందడి

వివరాలు 2లో

SRI GOLD
TRUSTED GOLD BUYERS

బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,11,330 |
| 22 క్యారెట్ | 1,02,050 |
| సిల్వర్ (కేజీ) | 1,33,000 |

# సిద్దిపేట మీ జాగీరా?
## సిద్దిపేటకు రావాలంటే కేజీఎఫ్‌లోకి వెళ్ళినట్లు ఆంక్షలా?
### సిద్ది పేట.. చింతమడకకు మళ్ళీమళ్ళీ వస్తా

మీ భరతం పడతా.. నా ఫ్యామిలీపై కుట్రచేసినోళ్ళను వదల

చింతమడక పౌరుషం ఎలా ఉంటుందో తప్పకుండా చూపిస్తా

హరీష్ టార్గెట్‌గా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర విమర్శలు

డప్పు చప్పుళ్లు, మంగళ హారతులతో కవితకు సొంతూరు ఘన స్వాగతం

భావోద్వేగంతో కవిత కన్నీరు .. చింతమడక గ్రామస్థులతో కలిసి బతుకమ్మ ఆట



**హైదరాబాద్, మహా :** బతుకమ్మ పండుగవేళ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం సిద్దిపేట జిల్లా చింతమడకలో నిర్వహించిన ఎంగిలిపూల బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న కవిత నా ఫ్యామిలీపై కుట్రలు చేసినోళ్లను వదలిపెట్టనని.. భవిష్యత్‌లో వాళ్ల భరతం పడతానని హెచ్చరించారు. చంద్రుడి లాంటి కేసీఆర్‌కు మచ్చ తెచ్చారు. నన్ను నా కుటుంబానికి దూరం చేశారు. సిద్దిపేట వారి జాగీర్ అన్నట్లు ప్రవర్తిస్తున్నారు. సిద్దిపేటకు వస్తుంటే కూడా వారి కేజీఎఫ్‌లోకి వస్తున్నట్లు ఆంక్షలు పెట్టారు. సిద్దిపేట ఎవరి జాగీర్ కాదు. ఇక్కడ ఎవరి ఆంక్షలు పనిచేయవు. నా కుటుంబానికి ఈ పరిస్థితులు తీసుకొచ్చిన ఎవరినీ వదలను. ఒక్కొక్కరి భరతం పడతా. చింతమడక పౌరుషం ఎలా ఉంటుందో వారికి తప్పకుండా చూపిస్తా' అని కల్వకుంట్ల కవిత స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

వివరాలు 2లో



## ఇడ్లీ, దోశలపై 5%జీఎస్టీ
**చపాతీ, పరోటాలాపై 18 శాతం నుండి జీరో జీఎస్టీ**

దక్షిణ భారతదేశంపై ఇది కాదా కేంద్రం వివక్ష?

కేంద్రం తీరుపై నెటిజన్ల ఫైర్.. సోషల్ మీడియాలో భగ్గు

**హైదరాబాద్, మహా:** దక్షిణ భారతీయులు ఎక్కువగా తినే అల్పాహారం ఇడ్లీ, దోశలపై 5 శాతం జీఎస్టీ విధించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నార్త్ ఇండియన్స్ ఎక్కువగా తినే చపాతీ, పరోటాలా మీద ఉన్న 18 శాతం జీఎస్టీని జీరో చేసి.. సౌత్ టిఫిన్లపై మాత్రం పన్నుల భారం మోపడంపై తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మిగతా 2లో



## నేపాల్‌లో ముగిసింది..
**ఫిలిప్పీన్స్‌లో మొదలైంది**

అవినీతిపై యువత పోరు

వివరాలు 2లో

## బిగ్ రిలీఫ్
**హెచ్ -1 బి కొత్త దరఖాస్తులకే లక్ష డాలర్ల రుసుము**


వైట్‌హౌస్ వెల్లడి

వివరాలు 7లో

స్టాక్ మార్కెట్

| | |
|---|---|
| సెన్సెక్స్ | ↗ 82,626.23 |
| నిఫ్టీ | ↗ 25,327.05 |

### తెలంగాణ ఉక్కుమనిషి కొండా లక్ష్మణ్ బాపూజీ
**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**



**హైదరాబాద్, మహా:** తెలంగాణ ఉక్కు మనిషి కొండా లక్ష్మణ్ బాపూజీ అని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి పురస్కరించుకొని నెక్లెస్ రోడ్‌లోని ఆ మహనీయుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మిగతా 2లో

ఈరోజు గుడ్డు ధరలు

ఎన్ఈసీసీ గుడ్డు ధర

| 1 పీస్ | ట్రే |
|---|---|
| 5.4 | 162 |

హోల్ సేల్ గుడ్డు ధర

| 1 పీస్ | ట్రే |
|---|---|
| 5.4 | 162 |

రిటైల్ గుడ్డు ధర

| 1 పీస్ | ట్రే |
|---|---|
| 5.72 | 171.72 |

## పోలీస్ బాస్ పై ఉత్కంఠ
శివధర్ రెడ్డి లేదా సీవీ ఆనంద్ లలో ఒకరికి ఛాన్స్

పరిశీలనలో అనేక పేర్లు.. నెలాఖరుకు రిటైర్ కానున్న ప్రస్తుత డిజిపి

సీఎం రేవంత్ ఛాయిస్ పై హై టెన్షన్

వివరాలు 2లో



## ఆదిలాబాద్‌లో భారీ భూ కుంభకోణం బట్టబయలు
- డబల్ రిజిస్ట్రేషన్ కేసులో బీజేపీ నేతతో పాటు మరో ఇద్దరి అరెస్ట్
- 2 కోట్ల విలువైన భూమిని మళ్లీ రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఘనులు
- సహకరించిన సబ్ రిజిస్ట్రార్ పరారీలో , కేసు నమోదు చేసిన పోలీసులు


వివరాలు 2లో

## భారీవర్షంలో ఓజీ.. ఈవెంట్
**కత్తి పట్టుకుని వేదికపైకి పవన్ గ్రాండ్ ఎంట్రీ**

వర్షం మనల్ని ఆపగలదా.. ఉత్సాహపరిచిన పవన్ ప్రసంగం

**హైదరాబాద్, మహా :** ఎల్బీ స్టేడియంలో ఆదివారం రాత్రి 'ఓజీ' ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగింది. అందులో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కటానాతో సందడి చేశారు. ' ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో కుండపోత వర్షాన్ని సైతం లెక్కచేయకుండా

వివరాలు 2లో



## దేశవ్యాప్తంగా జీఎస్టీ ఉత్సవ్
నవరాత్రుల సందర్భంగా కొత్త ధరలు

ప్రధాని మోదీ ప్రకటన

వివరాలు 2లో



## భారత్-పాక్ యుద్ధం ఆపింది నేనే

### నాకు నోబెల్ ఇవ్వాలి

### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

**మహా:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానని, ఈ ఘనతకు గానూ తనకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని ఆయన అన్నారు. వాణిజ్యాన్ని ఒక ఆయుధంగా ఉపయోగించి ఈ సంక్షోభానికి తెరదించినట్లు ఆయన పేర్కొన్నారు. శనివారం జరిగిన అమెరికన్ కార్నర్‌స్టోన్ ఇన్‌స్టిట్యూట్ ఫౌండర్స్ డిన్నర్‌లో ట్రంప్ ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన హయాంలో ప్రపంచ వేదికపై అమెరికాకు ఎన్నడూ లేనంత గౌరవం లభించిందని ట్రంప్ తెలిపారు. "మేం శాంతి ఒప్పందాలు కుదురుస్తున్నాం, యుద్ధాలను ఆపుతున్నాం. భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని మేమే ఆపాం" అని ఆయన స్పష్టం చేశారు. దీన్ని ఎలా సాధించారో వివరిస్తూ, "వాణిజ్యంతోనే దీన్ని ఆపాను. ఇరు దేశాల నేతలంటే నాకు గౌరవం ఉంది. కానీ, 'మీరు యుద్ధానికి దిగితే మేం ఎలాంటి వాణిజ్యం చేయబోం' అని నేను వారికి స్పష్టం చేశాను. వారి వద్ద అణ్వాయుధాలు ఉన్నాయి. దాంతో వారు యుద్ధం ఆపేశారు" అని ట్రంప్ వివరించారు. కేవలం భారత్‌పాకిస్థాన్ మధ్యే కాకుండా, థాయ్‌లాండ్‌కంబోడియా, ఆర్మేనియాఅజర్‌బైజాన్, సెర్బియాకొసోవో సహా మొత్తం ఏడు యుద్ధాలను తాను ఆపినట్లు ట్రంప్ పేర్కొన్నారు. తాను ఆపిన వాటిలో 60 శాతం వాణిజ్య సంబంధాల ద్వారానే సాధ్యమయ్యాయని ఆయన తెలిపారు. రష్యాఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపితే నోబెల్ బహుమతి వస్తుందని కొందరు తనతో అన్నారని చెబుతూ, "మరి నేను ఆపిన ఈ ఏడు యుద్ధాల సంగతేంటి? నాకు ప్రతిదానికీ ఒక నోబెల్ బహుమతి రావాలి కదా?" అని ట్రంప్ వ్యాఖ్యానించారు.



# రాష్ట్రమంతా పూల పండుగ శోభ

### వేయి స్తంభాల గుడిలో వైభవంగా బతుకమ్మ ఉత్సవాలు

భట్టి , పొంగులేటి , జూపల్లి కృష్ణారావు, సీతక్క, సురేఖ హాజరు

చిన్న పెద్ద అందరినీ ఆకట్టుకున్న అలంకరించిన బతుకమ్మలు

బతుకమ్మ పాటలు, దశావతార నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకల్లో సందడి

**హన్మకొండ, మహా:** తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ రాష్ట్రవ్యాప్తంగా అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హన్మకొండలోని చారిత్రక వేయి స్తంభాల గుడి వద్ద రాష్ట్ర స్థాయి బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. వేయి స్తంభాల గుడిలో మన బతుకమ్మ కార్నివాల్ ఉత్సవాలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ధనసరి అనసూయ, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ కడియం కావ్య, మేయర్, ఎమ్మెల్సీ, మ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వేయి స్తంభాల గుడిలో దేవుళ్లను దర్శించుకొని పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రకృతిని, స్త్రీశక్తిని ఆరాధించే ఈ పండుగకు వారు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళల సామూహిక ఐక్యత, సంప్రదాయాల రక్షణకు ఈ ఉత్సవాలు నిదర్శనంగా నిలిచాయి. ముందుగా.. సెప్టెంబర్ 21 సాయంత్రం 5 గంటలకు వేయి స్తంభాల గుడి వద్ద ఎంగిలిపూల బతుకమ్మతో ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. వందలాది మంది మహిళలు, బాలికలు ఇందులో పాల్గొన్నారు. తీరొక్క పువ్వులు, గుమ్మడి పువ్వులు, తంగేడు పువ్వులు, కట్లపువ్వులతో అలంకరించిన బతుకమ్మలు అందరినీ ఆకట్టుకున్నాయి. బతుకమ్మ పాటలు, దశావతార నృత్యాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకల్లో సందడి నెలకొంది.



పువ్వులను పూజించే గొప్ప పండుగ బతుకమ్మ..

తెలంగాణ సాంస్కృతిక సారధి ఛైర్ పర్సన్ వెన్నెల గద్దర్ ఆధ్వర్యంలో రూపొందించిన బతుకమ్మ పాటల సీడీని ఆవిష్కరించారు. అనంతరం మహిళా మంత్రులు, ఎంపీ, మేయర్, కార్పొరేషన్ ఛైర్మన్లు, ఇతర మహిళా ప్రజాప్రతినిధులు బతుకమ్మ విశిష్టతను తెలుపుతూ పాటలు పాడారు. మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మలను పేర్చుకొని తరలి రావడంతో వారితో కలిసి బతుకమ్మ ఆడారు. వేయి స్తంభాల గుడి పరిసర ప్రాంతాలన్ని కొత్త శోభను సంతరించుకున్నాయి. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవమైన బతుకమ్మకు ఎంతో విశిష్టత ఉందని, ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా పువ్వులను పూజించే గొప్ప పండుగ బతుకమ్మ అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా ఆడబిడ్డలందరికీ మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఆడబిడ్డలు తరతరాలుగా ఈ బతుకమ్మ సంబరాలను భక్తి శ్రద్ధలతో జరుపుకంటూ అమ్మవారిని కొలుస్తారన్నారు. ఆ అమ్మవారు ఆడబిడ్డల కోరికలన్నింటిని నెరవేర్చాలని ఆశిస్తున్నానని మంత్రి తెలిపారు. బతుకమ్మ పండుగ ఔన్నత్యాన్ని చాటి చెప్పేలా ప్రజా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తొమ్మిది రోజుల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

# సిద్దిపేట మీ జాగీరా?

(మొదటిపేజీ తరువాయి)

కేసీఆర్ స్వగ్రామం చింతమడకలో ఆదివారం జరిగిన ఎంగిల పూల బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కవితకు డప్పు చప్పుళ్లు, మంగళ హారతులతో గ్రామస్థులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. చింతమడక గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చిన్నారామ్ ముత్యం ఇంట్లో తోటి మహిళలతో కలిసి పాటలు పాడుతూ కవిత బతుకమ్మను పేర్చారు. అనంతరం మహిళలు, గ్రామస్తులతో కలసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. చింతమడక ఇచ్చిన ధైర్యంతో తెలంగాణ ఉద్యమ సమయంలో రాష్ట్రమంతా తిరిగానని గుర్తు చేసుకున్నారు. కుటుంబానికి దూరమైన బాధలో ఉన్న నాకు చింతమడక అండగా నిలిచిందని కవిత భావోద్వేగానికి గురయ్యారు. ప్రత్యేక పరిస్థితుల్లోనూ తనను ఆదరించారని చింతమడక గ్రామ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఇవాళ సిద్దిపేట రావాలంటే కేజీఎఫ్‌లోకి వెళ్లినట్లు ఆంక్షలు పెడుతున్నారని కానీ ఇక్కడ ఎవరి ఆంక్షలు పని చేయవని హాట్ కామెంట్ చేశారు.

**కొందరు సిద్దిపేటను సొంత ఆస్తిలా చూస్తున్నారు**

కొంతమంది సిద్దిపేట, చింతమడకను సొంత ఆస్తిలా చూస్తున్నారు. కానీ ఏ ఊరు.. ఎవ్వరి జాగీరు కాదు. మళ్లీ మళ్లీ సిద్దిపేట, చింతమడకకు వస్తా. ఆంక్షలు పెడితే ఇంకా ఎక్కువగా వస్తానని కవిత హెచ్చరించారు . నన్ను నా కుటుంబానికి దూరం చేశారు.. నా కుటుంబంపై కుట్రలు చేసిన వాళ్లను వదలిపెట్టనని అన్నారు. చంద్రుడి లాంటి కేసీఆర్‌కి కూడా మచ్చ తెచ్చారని ఫైర్ అయ్యారు. బతుకమ్మ పండగ వేళ కేసీఆర్ సొంతూర్‌లో కవిత చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. బీఆర్ఎస్ కీలక నేత హరీష్ రావును ఉద్దేశించే కవిత ఈ విమర్శలు చేశారన్న చర్చ సర్వత్రా ఉంది. గత కొద్దిరోజులుగా హరీష్ అభిమానులు పండుగకు వస్తే.. వచ్చిపోండి కానీ ఏవైనా వ్యాఖ్యలు చేస్తే పరిస్థితి వేరేగా ఉంటుందంటూ పెట్టిన పోస్టులను బట్టే కవిత రియక్టయ్యారని భావిస్తున్నారు. ఒక దశలో కవిత భావోద్వేగానికి గురై కన్నీరుపెట్టుకున్నారు. హైదరాబాద్ నుండి చింతమడకకు వచ్చిన కవితకు మార్గమధ్యలో అభిమానులు స్వాగతం పలకడంతో పాటు సీఎం..సీఎం అంటూ నినాదాలు చేశారు.

# ఆదిలాబాద్‌లో భారీ భూ కుంభకోణం బట్టబయలు

### డబల్ రిజిస్ట్రేషన్ కేసులో బీజేపీ నేతతో పాటు మరో ఇద్దరి అరెస్ట్

2 కోట్ల విలువైన భూమిని మళ్లీ రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఘనులు

సహకరించిన సబ్ రిజిస్ట్రార్ పరారీలో, కేసు నమోదు చేసిన పోలీసులు

**ఆదిలాబాద్ మహా:** ఆదిలాబాద్‌లో భారీ భూ కుంభకోణాన్ని మావల పోలీసులు బట్టబయలు చేసారు. భూకబ్జాలపై మెసేజ్ యువర్ ఎస్పీ కార్యక్రమం ద్వారా బాధితుల ఫిర్యాదుతో ఈ కుంభకోణం వెలుగు చూసినట్టు తెలిపారు.పట్టణంలో కోట్ల విలువైన 7 ప్లాట్లను నకిలీ పత్రాలతో డబుల్ రిజిస్ట్రేషన్ చేసి ఆక్రమించిన ముఠాలో ముగ్గురిని అరెస్ట్ చేసినట్టు మావల సీఐ కర్ర స్వామి తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. బాధితుడు మిల్లింద్ కొర్తల్‌వార్ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు ప్లాట్లను డబుల్ రిజిస్ట్రేషన్ చేసిన కేసులో ఆర్ డబ్ల్యూఎస్ డీఈఈ.నానం వెంకటరమణ, బీజేపీ నేత ఉష్క మల్ల రఘుపతి , రిమ్స్ ఆయుష్ విభాగం ప్రభుత్వ ఉద్యోగి బెజ్జవార్ సంజీవ్‌కుమార్ లను అరెస్ట్ చేసినట్టు తెలిపారు .ఒరిజినల్ సేల్ డీడ్స్ ఉన్నా పట్టించుకోకుండా నకిలీ పత్రాలు సృష్టించి సుమారు 2కోట్ల విలువైన ప్లాట్లను సబ్ రిజిస్ట్రార్ అశోక్‌కు 7 లక్షల రూపాయల లంచం ఇచ్చి మళ్లీ రిజిస్ట్రేషన్ చేయించారని తెలిపారు. అతని పై కూడా కేసు నమోదు చేసామని ప్రస్తుతం పరారీలో ఉన్నట్టు వివరించారు. నిందుతులపై ఐపీసీ 447, 427, 420, 467, 468, 471, 120బీ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై ప్రవీణ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఇడ్లీ, దోశలపై 5% జీఎస్టీ

(మొదటిపేజీ తరువాయి)

ఇది కాదా.. దక్షిణ భారతంపై కేంద్రం వివక్ష? అంటూ నెటిజన్లు ఫైరవుతున్నారు. దక్షిణాది రాష్ట్ర ప్రజల మీద వివక్ష చూపించడానికి జీఎస్టీ పన్నులు కారణం అవుతున్నాయని ఆగ్రహం ప్రదర్శిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఇలా ఎందుకు చేశారంటూ సోషల్ మీడియాలో నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉత్తరాది ప్రజలు ఎక్కువగా చపాతీ, పరోటా తింటారు కాబట్టి వారు తినే టిఫిన్ల మీద జీఎస్టీ తగ్గించి.. దక్షిణాది వారి అల్పాహారంగా ఎక్కువ మంది తినే ఇడ్లీ, దోశల మీద జీఎస్టీ పెంచడం కరెక్టేనా అని ప్రశ్నిస్తున్నారు. దోశలపై విధించిన జీఎస్టీ పన్ను దక్షిణ భారతదేశంలోని ప్రజల జీవనశైలి, ఆహార అలవాట్లపై తీవ్ర ప్రభావం చూపుతుందని, ఇది పన్ను విధానంలో అసమానతలకు దారి తీస్తుందని నెటిజన్స్ విమర్శలు గుప్పిస్తున్నారు. నిన్నటిదాకా.. బాషను బలవంతంగా రుద్దాలని చూశారు.. ఇపుడు టిఫిన్లపై భారాలు మోపుతున్నారు? ఎందుకు సౌత్ అంటే మీకు కక్ష అంటూ నెటిజన్ల ఫైరవుతున్నారు. ఇడ్లీ, దోశపై కూడా జీరో ట్యాక్స్ చేయాలని.. లేకుండా ఖచ్చితంగా కేంద్రం వివక్ష, కక్ష చూపినట్లేనంటూ నెటిజన్లు కామెంట్స్ పెడుతున్నారు. కేంద్రం స్పందించకుంటే ఇడ్లీ, దోశ ఉద్యమం మరింత పెరిగే ఆస్కారముంది.

# పోలీస్ బాస్‌పై ఉత్కంఠ

### శివధర్ రెడ్డి లేదా సీవీ ఆనంద్‌లలో ఒకరికి ఛాన్స్

పరిశీలనలో అనేక పేర్లు.. నెలాఖరుకు రిటైర్ కానున్న ప్రస్తుత డిజిపి

సీఎం రేవంత్ ఛాయిస్ పై హై టెన్షన్

**హైదరాబాద్, మహా :** తెలంగాణ నూతన పోలీస్ బాస్ ఎవరనేదానిపై ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుత డిజిపి జితేందర్ ఈ నెలాఖరులో రిటైర్ అవుతున్న నేపథ్యంలో కొత్త డీజీపీ ఎవరన్నది ఆసక్తికరంగా మారింది. ఈ అంశంపై చర్చ గడిచిన కొద్దికాలంగా నడుస్తూనే ఉంది. ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డి, ప్రస్తుత సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ మధ్యే ప్రధాన పోటీ ఉందన్న చర్చ అధికారవర్గాల్లో ఉంది. వీరిలో సీఎం రేవంత్ రెడ్డి ఛాయిస్ ఎవరనే అంశంపై రకరకాల చర్చలు ఉన్నాయి. ఇద్దరిలోనూ సారూప్యత ఉండడంతో, సర్వీసును పరిగణనలోకి తీసుకుని నిర్ణచయయం తీసుకోవొచ్చన్న చర్చ ఉంది. ఇద్దరిదీ ఒకే సామాజిక వర్గం కావటం.. ఇద్దరూ తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారుకావటంతో ప్రభుత్వం ఎవరిని ఎంపిక చేసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతానికి ప్రభుత్వం వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం ఇంటెలిజెన్స్ డీజీగా వ్యవహరిస్తున్న శివధర్ రెడ్డి వైపే ప్రభుత్వం మొగ్గు చూపుతున్నట్లుగా ప్రచారముంది. ఆయన 1994 బ్యాచ్ కు చెందిన ఐపీఎస్ అధికారి. మరోవైపు ఆయనకు ప్రధాన పోటీదారుగా ఉన్నారు 1991 బ్యాచ్ కు చెందిన సీవీ ఆనంద్. ఒకవేళ శివధర్ రెడ్డిని డీజీపీగా నిర్ణయిస్తే.. సీవీ ఆనంద్ ను విజిలెన్స్ డీజీగా.. ఏసీబీ చీఫ్ బాధ్యతలు అప్పగించే వీలు ఉందని చెబుతున్నారు. శివధర్ రెడ్డికి రిటైర్మెంట్ దగ్గరగా ఉండటం.. సీవీ ఆనంద్ కు ఎక్కువ కాలం ఉన్న నేపథ్యంలో ఇద్దరికి డీజీపీ అయ్యే అవకాశాన్ని కల్పించాలని భావిస్తున్నట్లు చెబుతున్నారు. అందుకే ప్రస్తుతానికి శివధర్ రెడ్డికి డీజీపీ హోదా కట్టబెట్టి.. సీవీ ఆనంద్ ను గౌరవప్రదంగా పోలీసు శాఖతో సంబంధం లేకుండా ప్రభుత్వ పరిధిలో ఉంటూ తన బాధ్యతల్ని నిర్వర్తించే వీలు ఆనంద్ కు ఉంటుంది. రాబోయే ఎన్నికలు, సవాళ్ళను పరిగణనలోకి తీసుకుని సీఎం రేవంత్ డిజిపిపై తుదినిర్ణయం తీసుకునే అవకాశముంది.

**రేసులో శిఖాగోయల్**

ఇదిలా ఉంటే పోలీస్ బాస్ పోస్టుకు శిఖాగోయల్ కూడా పోటీ పడుతున్నట్లు చెబుతున్నారు. డీజీపీకి పోటీ పడుతున్న వారిలా ఉంటే.. హైదరాబాద్ మహానగర పోలీసు కమిషన్ పోస్టుకు సైతం భారీ పోటీ నెలకొని ఉంది. సీవీ ఆనంద్ బదిలీ అయితే.. ఆయన స్థానంలో ఎవరు వస్తారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ఆర్టీసీ ఎండీగా ఉన్న సజ్జనార్ .. ప్రస్తుతం శాంతిభద్రతల అడిషనల్ డీజీగా ఉన్న మహేశ్ భగవత్ ప్రధానంగా పోటీ పడుతున్నట్లుగా చెప్పాలి. వీరితో పాటు చారుసిన్హా.. డీఎస్ చౌహాన్.. నాగిరెడ్డిలు కూడా పోటీ పడుతున్నారు. వీరితో పాటు వీవీ శ్రీనివాస్.. స్వాతిలక్రా.. సంజయ్ కుమార్ జైన్.. స్టీఫెన్ రవీంద్రలు కూడా హైదరాబాద్ సీపీ పోస్టుకు అర్హులుగా ఉన్నారు. వీటిలో సజ్జనార్ పేరు హైదరాబాద్ సీపీతో పాటు ఇంటెలిజెన్స్ డీజీ పోస్టుకు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇంటెలిజెన్స్ డీజీగా ఉన్న అనిల్ కుమార్ పేరు కూడా వినిపిస్తోంది. సైబరాబాద్ సీపీ సైతం బదిలీ అయ్యే అవకాశం ఉంది. దసరాకు కొత్త పోలీస్ బాస్ బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

## తెలంగాణ ఉక్కుమనిషి కొండా లక్ష్మణ్ బాపూజీ

### టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

(మొదటిపేజీ తరువాయి)

ఈ కార్యక్రమంలో తెలంగాణ వార్ రూమ్ ఇన్‌ఛార్జి అనుష, బీసీ సంఘం నాయకులు, పలువురు నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ మహేశ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కొండా లక్ష్మణ్ బాపూజీ అనుసరించిన మార్గం తమ ప్రభుత్వానికి మార్గదర్శకం అని అన్నారు. ఆయన లాంటి నాయకులు అరుదని చెప్పారు. కొండా లక్ష్మణ్ బాపూజీ త్యాగ ధనుడని, తెలంగాణ కోసం మంత్రి పదవిని త్యాగం చేసిన త్యాగమూర్తి అని కొనియాడారు. బీసీలు మా వాటా ఏది అనే స్థితికి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకు వచ్చిందన్నారు.

## తెలంగాణలో జెన్ జెడ్ వల్లే బీఆర్ఎస్‌కు సున్నా సీట్లు

### కేటీఆర్ కు కేంద్ర మంత్రి బండి సంజయ్ కౌంటర్

**హైదరాబాద్, మహా:** జన్ జడ్ వ్యాఖ్యలపై కేటీఆర్ కు కేంద్రమంత్రి బండిసంజయ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. "నేపాల్ జనరల్ జెడ్ బంధుప్రీతికి వ్యతిరేకంగా వీధుల్లోకి వచ్చారు. కానీ తెలంగాణలో మాత్రం జన్ జెడ్ ఉద్యమం మొదట బీఆర్ఎస్ పార్టీపైనే మొదలైందని, కేసీఆర్‌కు ఆయన పిల్లలను ఓటు వేయకుండా.. బీఆర్ఎస్ ను లోక్‌సభ ఎన్నికల్లో 0 సీట్లకు పరిమితం చేసి.. రాష్ట్రంలోని జెన్ జెడ్ యువత బీఆర్ఎస్ పాలన ను అంతం చేశారు. దీంతో తెలంగాణలో ఈ నెపో వారసుడు తనకు అర్హమైన వాస్తవికతను పొందాడు."అంటూ బండి సంజయ్.. కేటీఆర్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు.



# భారీవర్షంలో ఓజీ.. ఈవెంట్

### కత్తి పట్టుకుని వేదికపైకి పవన్ గ్రాండ్ ఎంట్రీ

వర్షం మనల్ని ఆపగలదా.. ఉత్సాహపరిచిన పవన్ ప్రసంగం

(మొదటిపేజీ తరువాయి)

హాజరైన వేలాది అభిమానుల కేరింతల మధ్య ఈ ఓజీ కాన్సెర్ట్ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన పవన్ కల్యాణ్, చేతిలో కత్తి పట్టుకుని ర్యాంప్‌పై నడుస్తూ వేదికపైకి గ్రాండ్ ఎంట్రీ ఇచ్చారు. భారీ వర్షంలో తడుస్తూనే ఆయన తన ప్రసంగాన్ని కొనసాగించారు. ఈ సినిమాపై తనకున్న ప్రేమను వ్యక్తం చేస్తూ, "ఈ సినిమాను నేను ఇంతలా ప్రేమిస్తానని ఊహించలేదు. దీనికి ప్రధాన కారణం దర్శకుడు సుజీత్, సంగీత దర్శకుడు తమన్. వాళ్లిద్దరూ ఒక ట్రిప్‌లో ఈ సినిమా చేశారు. ఆ ట్రిప్‌లోకి నన్ను కూడా లాగేశారు. సుజీత్ చాలా తక్కువ మాట్లాడతాడు, కానీ సినిమా అద్భుతంగా తీస్తాడు. అతని విజన్‌ను తమన్ తన సంగీతంతో మరో స్థాయికి తీసుకెళ్లాడు" అని వారిద్దరిపై ప్రశంసల వర్షం కురిపించారు. తన రాజకీయ బాధ్యతల గురించి ప్రస్తావిస్తూ, "ఈ సినిమా షూటింగ్ చేస్తున్న సమయంలో నేను ఒక ఉప ముఖ్యమంత్రిని అన్న సంగతే మర్చిపోయాను. ఒక డిప్యూటీ సీఎం ఇలా కత్తి పట్టుకుని కనిపిస్తే ప్రజలు ఊరుకుంటారా? కానీ కథ కోసం చేయాల్సి వచ్చింది. 'ఖుషీ' సినిమా సమయంలోనే ఇలాంటి కత్తి ఫైట్ ప్రాక్టీస్ చేశాను. ఇప్పుడు సుజీత్ దానికి ఒక అద్భుతమైన కథను అల్లి తెరపై చూపించాడు" అని అన్నారు. సినిమాలోని ప్రేమకథ గురించి మాట్లాడుతూ, కథానాయిక ప్రియాంక అరుళ్ మోహన్‌తో తన కెమిస్ట్రీ చాలా బాగా వచ్చిందని తెలిపారు. ఈ వర్ష్ మనల్ని ఆపగలదా అంటూ అభిమానులను ఉత్సాహపరిచారు. ట్రైలర్ తో అంచనాలు పెంచేశారు.

## దేశవ్యాప్తంగా జీఎస్టీ ఉత్సవ్

### నవరాత్రుల సందర్భంగా కొత్త ధరలు.. ప్రధాని మోదీ ప్రకటన

**ఢిల్లీ, మహా:** దేశ ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీపికబురు అందించారు. నవరాత్రుల తొలి రోజైన సోమవారం నుంచి దేశవ్యాప్తంగా 'జీఎస్టీ ఉత్సవ్' ప్రారంభం కానుందని ప్రకటించారు. కొత్తగా అమలవుతున్న జీఎస్టీ సంస్కరణల వల్ల వస్తువుల ధరలు గణనీయంగా తగ్గుతాయని, ఇది ప్రజలకు ఒక 'పొదుపు పండగ' అవుతుందని ఆయన అభివర్ణించారు. దేశ చరిత్రలో నూతన అధ్యాయానికి ఇదే నాంది అని స్పష్టం చేశారు. ఆదివారం సాయంత్రం జాతిని ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. కొత్త జీఎస్టీ రేట్లు అమల్లోకి రావడం వల్ల ప్రజలు తమకు ఇష్టమైన వస్తువులను తక్కువ ధరలకే సులభంగా కొనుగోలు చేయవచ్చని ప్రధాని తెలిపారు. "ఇది ప్రతి భారతీయుడికి ఒక జీఎస్టీ పొదుపు పండగలాంటిది," అని ఆయన అన్నారు. జీఎస్టీ రేట్ల తగ్గింపు నిర్ణయం వల్ల ముఖ్యంగా పేదలు, నూతన మధ్యతరగతి వర్గాలకు రెట్టింపు ప్రయోజనం కలుగుతుందని మోదీ పేర్కొన్నారు. ఈ సంస్కరణలు సామాన్యులు, రైతులు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు), మధ్యతరగతి కుటుంబాలు, మహిళలు, యువతకు ప్రత్యక్షంగా మేలు చేస్తాయని ఆయన వివరించారు.



## భారత్ చేతిలో మరోసారి పాక్ చిత్తు

### ఆసియా కప్‌లో టీమిండియా ఘనవిజయం


భారత్ ఆసియాకప్ లో దాయాది పాకిస్తాన్ ను మరోసారి చిత్తు చేసింది. ఆరు ఫోర్లు, ఐదు సిక్స్ లతో అభిషేక్ 74 పరుగులు సాధించగా, తరువాత శుభమన్ గిల్, తిలక్ వర్మలు పని పూర్తి చేశారు. 172 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ సునాయాసంగా లక్ష్యం సాధించింది. పాక్ పసికూనలను చిత్తు చేసింది.

# ఓజీ.. ఫీవర్

### ఒక్క టికెట్ రూ.1.50 లక్షలు

### తెలుగు రాష్ట్రాల్లో సంచలనం

**విజయవాడ, మహా :**తెలుగు రాష్ట్రాల్లో ఓజీ మూవీ హవా నడుస్తోంది. సెప్టెంబర్ 25న సినిమా విడుదల కానుండగా.. ఇప్పటికే తొలిరోజు షోలు ఆల్ మోస్ట్ ఫుల్ అయ్యాయి. టికెట్ ధర ఎంతైనా సరే.. పవన్ కల్యాణ్ అభిమానులుగా తొలిరోజు సినిమా చూసి తీరాల్సిందేనని పట్టుబడుదుతున్నారు. తగ్గేదెలే అంటున్నారు. ఆఫ్‌లైన్లో టికెట్ల ప్రీ బుకింగ్స్ కోసం థియేటర్ల వద్ద బారులు తీరుతున్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభిమానిగా భీమిలి భీమిలి మండల జనసేన పార్టీ అధ్యక్షుడు నక్క శ్రీధర్ ఓజీ టికెట్ ను రూ.1.50 లక్షలకు కొనుగోలు చేశారు. పవన్ కల్యాణ్.. సినిమాల ద్వారా వచ్చే ఆదాయాన్ని పార్టీ బలోపేతానికి, సంక్షేమానికి వెచ్చిస్తున్నారని, అందుకే ఆయనకు మద్దతుగా ఈ వేలంలో పాల్గొన్నట్లు శ్రీధర్ తెలిపారు. చాలా ప్రాంతాల్లో టికెట్ల రేట్లు వేలల్లోకి వెళ్ళిపోయాయి. పవన్ కల్యాణ్ 12 ఏళ్ళ తర్వాత ఖుషి, అత్తారింటికిదారేది లాంటి సునామీ మళ్ళీ రిపీట్ చేయబోతున్నారని అభిమానులు అంటున్నారు.



# నేపాల్‌లో ముగిసింది

### ఫిలిప్పీన్స్‌లో మొదలైంది.. అవినీతిపై యువత పోరు



**మనీలా :** నేపాల్‌లో అల్లర్లు చల్లారి వారం గడవకముందే మరో దేశంలో ఇదే తరహా ఆందోళన మొదలైంది. ఫిలిప్పీన్స్‌లో ప్రభుత్వ అవినీతికి వ్యతిరేకంగా ఆ దేశ యువత కదం తొక్కారు. ఆదివారం వేలాది మంది నిరసనకారులు ఫిలిప్పీన్స్ రాజధాని నగరం మనీలా వీధుల్లోకి వచ్చి వరద నియంత్రణ అవినీతి కుంభకోణంపై ఆందోళన తెలిపారు. వరద నియంత్రణ ప్రాజెక్టుల్లో భారీ కుంభకోణం జరిగిందని.. శాసనసభ్యులు, ప్రభుత్వ అధికారులు, కాంట్రాక్టర్లు, వ్యాపారులు పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని నిరసనకారులు ఆరోపించారు. యువత పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు వ్యక్తం చేయడంతో మనీలాలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. నిరసనకారులను అదుపు చేయడం పోలీసులకు సవాల్‌గా మారింది. నిరసనలు దేశమంతటా వ్యాపించకుండా ముఖ్యమైన నగరాల్లో భారీగా భద్రతను పెంచారు. నేపాల్ తరహా పరిస్థితులు తలెత్తకుండా రాజకీయ నేతల ఇళ్ల దగ్గర భద్రతను కట్టుదిట్టం చేశారు. నేపాల్ లో ప్రభుత్వ అవినీతికి వ్యతిరేకంగా యువత ఆందోళనలు చేసిన సరిగ్గా 10 రోజులు గడవకముందే.. ఫిలిప్పీన్స్‌లో ఇదే తరహా ఆందోళనలు చెలరేగడం చర్చనీయాంశంగా మారింది.

## మనం సైతం ఫౌండేషన్
# పుష్కర మహోత్సవం

**కాదంబరి కిరణ్‌కు అభినందనలు, శుభాకాంక్షలు**

12 వసంతాలుగా 'మనం సైతం' నిరంతర సేవలు

కార్యక్రమంలో పాల్గొన్న రాజకీయ, సినీ, మీడియా ప్రముఖులు



**హైదరాబాద్, మహా :** నటుడు కాదంబరి కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మనం సైతం' ఫౌండేషన్ పుష్కర మహోత్సవం హైదరాబాద్ ఫిలిం ఛాంబర్‌లో ఘనంగా జరిగింది. పన్నెండేళ్లుగా సమాజ సేవా కార్యక్రమాలు చేపడుతున్న ఈ ఫౌండేషన్‌కు పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు. నిరంతరం కాదంబరి కిరణ్ చేస్తున్న సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, టీవీ5 మూర్తి, సీనియర్ జర్నలిస్ట్ దేవులపల్లి అమర్, ఏఎన్ఎన్ ఛానల్ సీఈఓ కంది రామచంద్రా రెడ్డి, ఛాంబర్ అధ్యక్షుడు భరత్ భూషణ్, జర్నలిస్ట్ సాయి, టీవీ9 ప్రుధ్వీ, కాజా సూర్యనారాయణ, తుమ్మలపల్లి రామసత్యనారాయణ, అశోక్ కుమార్, సురేష్ కొండేటి, టీఆర్ఎస్ రాఘవ, సాంబశివరావు, డీవీ రావు తదితరులు పాల్గొన్నారు.

## గాజులరామారంలో
# హైడ్రా బిగ్ ఆపరేషన్

**రూ.4500 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కబ్జా**

వంద ఎకరాలకు పైగా ఆక్రమణలో ఉన్నట్టు హైడ్రా గుర్తింపు

కూల్చివేతలను అడ్డుకుంటున్న స్థానికులు.. భారీ బందోబస్తు



**హైదరాబాద్, మహా:** నగరంలో మరోసారి హైడ్రా తన కొరడా ఝులిపించింది. ఈ మేరకు కుత్బుల్లాపూర్‌లోని గాజులరామారంలో హైడ్రా బిగ్ ఆపరేషన్ చేపట్టింది. సర్వే నెంబర్ 307లో అక్రమ కట్టడాల కూల్చివేస్తుంది. భారీ పోలీసు బందోబస్తు మధ్య హైడ్రా కూల్చివేతలు కొనసాగుతున్నాయి. అయితే.. కూల్చివేతలను ఆపాలని స్థానికులు అడ్డుకున్నారు. దీంతో హైడ్రా అధికారులకు స్థానికులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఎన్నో ఏళ్లుగా ఉన్న తమ ఇళ్ళను కూల్చి వేస్తున్నారంటూ.. బాధితుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవేందర్ నగర్, బాలయ్య బస్తీ, పోచమ్మ బస్తీలలో వందలాది ఇళ్లను అధికారులు నేలమట్టం చేశారు. అక్కడ ఉన్న ప్రభుత్వ భూమిని తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు హైడ్రా అధికారులు స్పష్టం చేశారు.

### 317 ఎకరాల ప్రభుత్వ భూముల్లో కబ్జాలను..

ఈ ఘటనపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. గాజులరామారం సర్వే నంబర్ 307లో ఉన్న 317 ఎకరాల ప్రభుత్వ భూముల్లో కబ్జాలను తొలగిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ డిపార్ట్మెంట్, హైడ్రా, పోలీస్ విభాగం సంయుక్తంగా భారీ స్థాయిలో ఆపరేషన్ చేపట్టినట్లు పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, స్థానిక రాజకీయ నాయకులు, అధికారులు ఆక్రమించిన వందల ఎకరాలను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుంటున్నట్లు ధీమా వ్యక్తం చేశారు. సుమారు 40 ఎకరాల్లో పేదలు నివసిస్తున్నారని పేర్కొన్నారు. స్థానిక రాజకీయ నాయకులు, పేదలకు అక్రమంగా 50, 100 గజాలుగా విక్రయించినట్లు విచారణలో బయటపడిందని చెప్పారు. గత 6 నెలల్లో అన్ని శాఖల అధికారులతో ఐదు సార్లు సమావేశాలు నిర్వహించి, ప్రభుత్వ అనుమతులు పొందిన తరువాతే ఇవాళ (ఆదివారం) ఆపరేషన్ చేపట్టినట్లు రంగనాథ్ స్పష్టం చేశారు. పేదల ఇళ్లు కూల్చవద్దని ఫీల్డ్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు రంగనాథ్ తెలిపారు. పొలిటీషియన్స్ , రియల్ ఎస్టేట్ వ్యాపారులు, అధికారులు ఆక్రమించిన భూమిలో ఉన్న కట్టడాలను మాత్రమే కూల్చి ఆ భూమిని స్వాధీనం చేసుకుంటున్నట్లు చెప్పారు.

# రంగంలోకి మంత్రి సీతక్క!

**సీఎం రేవంత్ పర్యటన ఏర్పాట్లు పరిశీలన**

రేపు మేడారానికి ముఖ్యమంత్రి.. అభివృద్ధి పనులపై రివ్యూ


**మేడారం, మహా:** రేపు మేడారం పర్యటనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్న నేపథ్యంలో మంత్రి సీతక్క రంగంలోకి దిగారు. సీఎం పర్యటన విజయవంతం చేసేందుకు ఆమె మేడారంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ, జిల్లా అధికార యంత్రాంగంతో పాటు సమ్మక్క సారలమ్మల పూజారులతో సమీక్ష చేపట్టారు. మంగళవారం మేడారం అభివృద్ధి ప్రణాళికను ఖరారు చేయనున్న ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను అధికారులు చురుగ్గా చేపడుతుండగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా సీతక్క స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రతి విభాగానికి మార్గనిర్దేశం చేస్తూ చేపట్టాల్సిన పనులపై ఆదేశాలు ఇస్తున్నారు. ఎంగిలిపూల బతుకమ్మ పండుగ నాడు కూడా తన భాద్యతలను విస్మరించకుండా ఉదయం 10 గంటలకు మేడారానికి చేరుకున్న మంత్రి సీతక్క సీఎం పర్యటన ఏర్పాట్లను సమీక్షించారు. ఆలయ ప్రాంగణంలో చేయాల్సిన మార్పులపై పూజారుల అభిప్రాయాలను తెలుసుకుంటూ, వారి సూచనలను అధికారులు అనుసరించేలా చర్యలు చేపట్టారు. మేడారం అభివృద్ధి ప్రణాళికలో భాగంగా భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, సీఎం రేవంత్ రెడ్డి పర్యటనలో అభివృద్ధి ప్రణాళికను ఖరారు చేస్తారని.. అనంతరం అభివృద్ధి పనులు వేగవంతమవుతాయని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.



# జీఎస్టీ కాదు గబ్బర్ సింగ్ ట్యాక్స్

వంద ఎలుకలు తిన్నాక పిల్లి తీర్థ యాత్రలకు వెళ్లినట్లు మోదీ తీరు

కేంద్రంపై ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే హాట్ కామెంట్స్



**ఢిల్లీ, మహా:** కేంద్రంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఎన్డీఏ ప్రభుత్వం జీఎస్టీ పేరిట తీసుకు వచ్చిన తొమ్మిది శ్లాబుల అంశంపై ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన సరళమైన, సమర్థవంతమైన జీఎస్టీకి బదులు ఎన్డీఏ ప్రభుత్వం తొమ్మిది వేర్వేరు శ్లాబుల ద్వారా గబ్బర్ సింగ్ పన్ను విధించిందని విమర్శించారు. ఎనిమిది ఏళ్లలో ప్రజల నుంచి రూ.55 లక్షల కోట్లకు పైగా వసూలు చేసిందని మండిపడ్డారు. ప్రజలపై ఆర్థికంగా తీవ్ర భారం పడ్డ తర్వాత ప్రధాని మోదీ పొదుపు పండుగ గురించి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి మోదీ తీరు వంద ఎలుకలు తిన్న తర్వాత పిల్లి తీర్థ యాత్రలకు వెళ్లినట్లు ఉందని ఎద్దేవా చేశారు. ఎన్డీఏ ప్రభుత్వం దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ అగ్ర నేత మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు.

# రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

మహిళలు అమ్మవారి స్వరూపంగా ఆర్థికంగా ఎదగాలి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హన్మకొండ, మహా:** అమ్మ వారి దీవెనలతో రాష్ట్ర సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం వేయిస్తంభాల దేవాలయంలో జరిగిన బతుకమ్మ ఉత్సవాల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడారు. మహిళలందరికీ ఎంగిలి పూల బతుకమ్మ పండుగా శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళలు అమ్మ వారి స్వరూపంగా మరింత ఆర్థికంగా ఎదగాలని ఆకాక్షించారు. మంత్రులు మాట్లాడుతూ చారిత్రాత్మక వేయిస్తంభాల బతుకమ్మ వేడుకలను నిర్వహించుకొవడం అద్భుతమైన సన్నివేశంగా పేర్కొన్నారు. ఈ పండుగ ప్రకృతితో మైమేకం అయిన పండుగ అంటూ అభివర్ణించారు. ఇది అంతర్జాతీయ స్థాయికి విస్తరించాయని, దీన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పాటలు కుడా బతుకు తీరును చూపిస్థాయన్నారు. ఈ పండుగకు ఒక చరిత్ర ఉందన్నారు. పసుపుతో తయారు చేసిన గౌరమ్మ చెరువులో నిమజ్జనం చేయడంతో చెరువు శుద్ధీ అవుతోందన్నారు.

# గుంతలు పూడ్చే తెలివి లేదు ఫోర్త్ సిటీ పేరు చెబుతూ గప్పాలా?

వరద బాధితులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ఫెయిల్

కండువాలు కప్పితే పార్టీ మారినట్లు కాదని రేవంత్‌వి బరితెగించి మాటలు

ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్



**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ సర్కార్‌పై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వరద బాధితులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. వానాకాలానికి ముందే నాలాలన్నీ శుభ్రం చేయాలని తెలిపారు. గతంలో కేసీఆర్ నాయకత్వంలో తలసాని శ్రీనివాస్ యాదవ్, కేటీఆర్ హైదరాబాద్ నగరంలో నాలాలన్నిటినీ క్లీన్ చేయించేవారని చెప్పారు. రేవంత్ రెడ్డి స్వయానా మున్సిపల్ శాఖ మంత్రిగా ఉంటూ.. బస్తీలను పట్టించుకొక, నాలాలు శుభ్రం చేయకపోవడం వల్ల నాలాల నుంచి వరద వచ్చింది. హైదరాబాద్ సనత్‌నగర్‌లోని రాంగోపాల్‌పేట డివిజన్‌లో వరదలో మునిగిపోయిన పలు కాలనీలను పరిశీలించి, బాధితులకు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి హరీశ్ రావు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వరద వల్ల ఇంట్లో ఉన్నటువంటి నిత్యావసర వస్తువులు కూడా కొట్టుకుపోయాయన్నారు. తినడానికి కూడా ఇబ్బంది పడే పరిస్థితి వచ్చిందని తెలిపారు.

**ఏడెనిమిది మంది నాలాల్లో కొట్టుకుపోయారు..**

రేవంత్ ప్రభుత్వం ఒక్క రూపాయి సహాయం కూడా వరద బాధితులకు చేయలేదని మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీ వర్షాలకు హైదరాబాద్‌లో ఏడెనిమిది మంది నాలాల్లో కొట్టుకుపోయి చనిపోయారన్నారు. వారి చావులకు కారణం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమని దుయ్యబట్టారు. కండువాలు కప్పినంత మాత్రాన పార్టీ మారినట్లు కాదని, రేవంత్ రెడ్డి పూర్తిగా బరితెగించి మాట్లాడుతున్నాడని విమర్శించారు. ముఖ్యమంత్రి కుర్చీ పరువు తీసేలా రేవంత్ ప్రవర్తిస్తున్నాడని చెప్పారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు, సరైన సమయంలో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్తారని వెల్లడించారు. బతుకమ్మ పండుగకు రేవంత్ రెడ్డి ఒక్క రూపాయి నిధులు ఇవ్వలేదని మండిపడ్డారు. పండుగ పూట గ్రామాల్లో చెత్త ఎత్తడానికి, ట్రాక్టర్లలో డీజిల్ పోయడానికి డబ్బులు లేవన్నారు. ఈ బతుకమ్మ పండుగ పూటైనా గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేసి, అతిపెద్ద పండుగైన బతుకమ్మ పండుగను జరుపుకునేటట్టు చెయాలన్నారు.




ఉద్యోగావకాశం

పత్రికా రంగంలో నూతన ఒరవడి సృష్టిస్తున్న

మహా పత్రికకు

(RNI NO: APTEL/2003/09316)

ఏపీ, తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు జిల్లాల వారీగా

స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

WWW.EPAPER.MAHAADAILY.COM

ఆసక్తి గల వారు సంప్రదించండి

MAHAAPATRIKA@GMAIL.COM,

95501 59679, 90001 41919

మీరు జర్నలిస్ట్ అవ్వాలనుకుంటున్నారా?

జర్నలిజంలో రాణించి సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను అరికట్టాలనుకుంటున్నారా? అయితే మీకిదే సువర్ణావకాశం

ANN SCHOOL OF JOURNALISMలో

జాయిన్ అయ్యి నిజమైన జర్నలిస్టులుగా గుర్తింపు తెచ్చుకోండి.

గృహిణులు, నిరుద్యోగులు, విద్యార్థులకు

ఇదే మా ఆహ్వానం

అడ్మిషన్లు ప్రారంభమైనవి

అప్లికేషన్‌కు ఆఖరుతేదీ - సెప్టెంబర్ 21

తరగతులు ప్రారంభం : సెప్టెంబర్ 28



పరిమితమైన సీట్లు, సీనియర్ పాత్రికేయులతో విద్యాబోధన

మీరున్న చోటు నుండే ఆన్‌లైన్‌లో జర్నలిజం క్లాసులు

త్వరపడండి...

8 వారాలు, 16 ఆన్‌లైన్ క్లాసులు

కోర్సు పూర్తైన విద్యార్థులకు జర్నలిజం సర్టిఫికెట్ ఇవ్వబడును

మెరిట్ స్టూడెంట్స్‌కు ఇంటర్న్‌షిప్ అవకాశం.. రికమండేషన్ లెటర్

FOR ADMISSIONS CONTACT: +91 74369 39999

SCAN ME

APPLY ON OUR OFFICIAL WEBSITE: WWW.ANNSCHOOLOFJOURNALISM.COM

మహా పత్రిక
తెలుగు
సోమవారం, హైదరాబాద్ | 22-09-2025
సాహిత్యం LITERATURE 04

## ఆడంబరాలు లేని దారి




ఈ దారి పైనే ఎన్ని ఉదయాలు మరెన్ని సాయంత్రాలు నడిచివెళ్లాయి
ఈ దారెంటనే ఎన్ని తరాలు కదిలిపోయాయి
తాను కదలకుండనే ఎన్ని జీవితాలను ముందుకు కదిలించింది
ఈరోజు నేను ఆ దారి మీదే నడుస్తున్నాను
అలా నడుస్తూ నడుస్తూ నాకే తెలియని గమ్యం వైపుకు నిష్క్రమిస్తాను
దారి అలాగే వుంటుంది.. దారిపైన పరుచుకున్న మట్టి, ధూళి అలాగే వుంటాయి
ఉదయాలు వికసిస్తూనే వుంటాయి
సాయంత్రాలు వెలుతురు చినుకులు చల్లితే
గుడారాల్లే చీకటి సేదతీరుతూ వుంటుంది
కాలం మౌనంగా తన నడక సాగిస్తూనే వుంటుంది
నా ఉనికి రూపం కోల్పోయి జ్ఞాపకంగా మారిపోతుంది
ఈ దేహం దారిపైన మట్టి ధూళి తప్ప
ఏ ఆడంబరాలు కనబడవు



- డా.రూప్ కుమార్ డబ్బీకార్
91778 57389

అంతర్జాతీయ కుమార్తెల దినోత్సవం
పురస్కరించుకొని,
జాలాది రత్నసుధీర్ రచించిన
కుమార్తెకు... ప్రేమతో నాన్న
పుస్తకావిష్కరణ - పరిచయ సభ
శనివారం 27/ 9 / 2025
సాయంత్రం 6 గం. లకు
కాన్ఫరెన్స్ హాల్ - రవీంద్ర భారతి
నిర్వహణ
పాలపిట్ట బుక్స్





రచనలకు ఆహ్వానం
సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు,
పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

పుస్తక సమీక్షల కోసం...
తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ
దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad. Telangana- 500034.

# తేటగీతిలో నవ్య కవిత్వం వెలువరించిన మహాకవి జాషువా

## (సెప్టెంబర్ 28, జాషువా 130వ జయంతి)

"విశ్వనాథ వారి పద్యాలు చాలా తక్కువ మందికి కంఠస్థమై ఉంటే.. జాషువా పద్యాలు చాలా ఎక్కువమందికి వాడుకలో ఉండేవి" అంటారు సంజీవ్ దేవ్ ఒక వ్యాసంలో. సాహితీవేత్తలు ఎంతోమంది దీనికి అనేక ఉదాహరణలు కూడా ఇచ్చారు.

ఆధునిక తెలుగు పద్య సాహిత్యంలో సంప్రదాయ ఛందస్సును స్వీకరించి, పద్యం ద్వారా అభ్యుదయాన్ని ఆశించి, సామాజిక దార్శనికతతో ఎంతో పద్య సాహిత్యాన్ని సృజించిన విశ్వనరుడు, మహాకవి గుఱ్ఱం జాషువా. తెలుగు సాహిత్యాన్ని సంస్కృతం అనే అలంకారాల నుండి విముక్తి చేసి, దానికి సహజమైన నడకలు నేర్పాలని చెప్పడమే గాక, పద్యాన్ని వచన శైలిలో జనరంజకంగా రాసిన ఒకే ఒక్కడు జాషువా అని కూడా అంటారు.

విస్పష్టమైన భావ వ్యక్తీకరణ జాషువా సొంతం. ఆయనే ఒకానొక సందర్భంలో.. "జీవితం నాకు ఎన్నో పాఠాలు నేర్పింది. నాకు గురువులు ఇద్దరు. పేదరికం. కులమత భేదం. ఒకటి నాకు సహనాన్ని నేర్పితే, రెండవది నాకు ఎదిరించే శక్తిని పెంచిందే గాని బానిసగా మాత్రం మార్చలేదు. దారిద్ర్యాన్ని, కులభేదాన్ని కూడా చీల్చి నేను మనిషిగా నిరూపించుకోదలిచాను. వాటిపై కత్తి గట్టాను. అయితే నా కత్తి కవిత. నా కత్తికి సంఘంపై ద్వేషం లేదు. దాని విధానంపై ద్వేషం." అంటాడు.

మతము, కులము.. మనిషిని ఎంత కుంగదీస్తాయో స్వానుభవంతో దెబ్బతిన్న పులి అయ్యాడు. అంటరానివాడు కవిత్వం రాయడం నేరమన్న వ్యవస్థని ధిక్కరించాడు.

ఆ స్వానుభవాలనే జాషువా గొప్ప అభివ్యక్తితో 'తేటగీతి' లో రాసిన నాలుగు పద్యాలను విశ్లేషించే ఒక అవకాశం ఇక్కడ తీసుకుంటున్నాను.


తెలుగు పద్య కవిత్వంలో ఒక ప్రముఖమైన పద్య ఛందస్సు 'తేటగీతి'. ఇది సరళమైన భాషలో పద్య రచన చేయడానికి అనుకూలంగా ఉంటుంది. దీనిని సాధారణంగా ప్రకృతి అందాలు, గ్రామాలు, నగరాలు లేదా దేవాలయాల వంటి వాటిని వర్ణించడానికి అనుకూలంగా ఉండి, లయబద్ధమైన శైలీ వర్ణనకు ఒక ప్రత్యేకమైన శోభను తీసుకొస్తుంది. నీతి కవిత్వ రచన చేసే సమయంలో సులభంగా అర్థమయ్యే రీతిలో నీతిని బోధించడానికి, లేదా సమాజానికి ఉపయోగపడే సందేశాలను ఇవ్వడానికి తేటగీతి సరైన ఛందస్సు. అందుకే జాషువా తను రచించిన ఎన్నో తేటగీతి పద్యాలలో సమాజాభివృద్ధి మనకు దర్శనమిస్తుంది.

'తేటగీతి'లో జాషువా అద్భుతంగా ఆవిష్కరించిన కొన్ని పద్యాలను చూద్దాం.

జిల్లా విద్యాశాఖ బోర్డ్ కు అధిపతిగా వచ్చిన కుప్పుస్వామి గారికి ఘన సన్మాన మహోత్సవంలో, పిలుపు లేకపోయినా సభకు హాజరై జాషువా చదివిన అద్భుతమైన పద్యములతో జరిగిన పరిచయంతో ఉపాధ్యాయుడుగా ఉద్యోగం పొందినప్పుడు, జాషువా రాసుకున్న తేటగీతి పద్యం చూడండి.

'ఉభయభాషాప్రవీణు లుద్యోగులకు
ప్రాకులాడెడు పండితుల్ పలువురుండ
యోగ్యతలు లేని నాకు నుద్యోగ మిచ్చి
పండితుని జేసి పంపె బాపట్లబడికి'

జాషువా గారి "నా కథ2" లోని ఈ పద్యం ఆయన జీవితంలో జరిగిన ఒక సంఘటనను, ఆనాటి సామాజిక పరిస్థితులను చాలా స్పష్టంగా తెలియజేస్తుంది. రెండు భాషలలో (తెలుగు, సంస్కృతం) ప్రవీణులు అయిన పండితులు ఎందరో ఉద్యోగాల కోసం తిరుగుతున్నా, గొప్ప యోగ్యతలు లేని తనకు బాపట్ల





పాఠశాలలో పండితుడిగా ఉద్యోగం ఇచ్చి పంపారు అనేది ఈ పద్యం యొక్క సరళమైన భావం. ఇక్కడ 'ప్రాకులాడెడు' అనే పదం చాలామంది పండితులు ఆ కాలంలో ఉద్యోగం కోసం ఎంతగా ఆరాటపడ్డారో తెలియజేస్తుంది. ఈ పద్యంలో అప్పటి సమాజంపై వ్యంగ్యం కూడా చాలా స్పష్టంగా కనిపిస్తుంది. గతంలో 'ఉభయభాషాప్రవీణ' లేకపోవడం వల్ల తనకు పదోన్నతి లభించలేదని జాషువా గారు బాధపడ్డారు. ఇప్పుడు అదే అర్హత లేని తనకి పండితుడి ఉద్యోగం రావడం ఒక విచిత్రమైన సంఘటనగా ఆయన భావించారు. ఇది ఆనాటి ఉద్యోగ నియామకాలలో ఉన్న లోపాలను పరోక్షంగా ఎత్తిచూపుతుంది.

జాషువా తనను తాను "యోగ్యతలు లేనివాడిని" అని ఈ పద్యంలో చెప్పుకోవడం ఆయనలోని గొప్ప వినయానికి నిదర్శనం. ఒక గొప్ప కవి అయినప్పటికీ, కేవలం కవిత్వం రాయడం మాత్రమే కాదు, పండితుల ప్రమాణాలను బట్టి తనని తాను నిరాడంబరంగా చూసుకున్నారు. పద్యం చివరి భాగంలో "పండితుని జేసి పంపె" అనే వాక్యం ఉంది. అంటే, ఆయన ప్రతిభను గుర్తించి ఆయన్ని పండితుడిగా నియమించారని తెలుస్తుంది. ఇది ఆనాటి సమాజంలో ఉన్న కొన్ని ప్రగతిశీలమైన ఆలోచనలకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

ఒక తేలును ఎంత ప్రేమగా తాకినా, అది తన స్వభావం ప్రకారం కచ్చితంగా కుట్టి, విపరీతమైన బాధను కలిగిస్తుంది. తేలుకు ప్రేమ, దయ వంటి భావాలు తెలియవు, దాని స్వభావం కుట్టడం మాత్రమే. అలాగే ఒక పామును..అది పాపం అని జాలిపడి చేరదీసినా, తన స్వభావం ప్రకారం కాటేయకుండా ఉండదు. తేలును, పామును పోలికగా తీసుకొని 'కాందిశీకుడు' కావ్యంలో ఒక పద్యం ఉంది. ఈ పద్యంలో శరణార్థులు అనుభవించే కష్టాలు, వారు ఎదుర్కొనే నమ్మకద్రోహాలు, వారికి ఆశ్రయం ఇచ్చినవారు సైతం వారిని బాధపెట్టడం వంటి అంశాలను జాషువా గారు చాలా గొప్పగా ఆవిష్కరించారు.

అలాంటి పరిస్థితుల్లో ఈ పద్యం కేవలం వ్యక్తిగత అనుభవాన్ని మాత్రమే కాకుండా, ఒక నిరాశ్రయుడు సమాజంలో ఎంతటి ద్రోహానికి గురవుతాడో చెప్పడానికి వాడిన గొప్ప ఉపమానంగా మనం గుర్తించవచ్చు. సమాజంలో ఉన్న కృతఘ్నుతను, నమ్మకద్రోహాన్ని, స్వార్థాన్ని ఒక జంతువు స్వభావంతో పోల్చి అద్భుతంగా తేటగీతిలో వివరించారు. ఎలాగో చూద్దాం:

ప్రేమతో ముట్టుకొన్నను వృశ్చికంబు
కుట్టి మిక్కుటముగ బాధపెట్టితీరు,
పాపమని చేరదీసిన పాపరాజు
చెనకకుండఁడు మరణ దంష్ట్రికలచేత.

ఇక్కడ 'పాపరాజు' అంటే పాము. 'మరణ దంష్ట్రికలు' అంటే మరణాన్ని కలిగించే కోరలు. అంటే, పాము తన ప్రాణాంతకమైన విషపు కోరలతో కచ్చితంగా ద్రోహం చేస్తుంది. ఈ రెండు ఉపమానాల ద్వారా జాషువా చెప్పదలచుకున్న ముఖ్య విషయం.. సమాజంలో కొంతమంది స్వార్థపరులు, నీచ స్వభావం కలవారు ఉంటారు. వారిని ఎంత ప్రేమగా, దయతో ఆదుకున్నా, వారు తమ స్వభావం ప్రకారం ద్రోహం చేయకుండా ఉండలేరు. వారికి మంచి, చెడు తెలియదు. కేవలం తమ స్వలాభం కోసమో, లేదా తమ సహజ స్వభావం వలనో ఇతరులకు హాని చేస్తారు.

ఈ పద్యం అప్పటి సమాజంలో జాషువా గారు ఎదుర్కొన్న చేదు అనుభవాలకు అద్దం పడుతుంది. సహాయం చేసినా కూడా కృతఘ్నుతతో ద్రోహం చేసిన వారిని ఈ పద్యం ద్వారా విమర్శించారు. ఒక వ్యక్తి స్వభావం చెడ్డదైతే, ఎంత మంచి చూపించినా ప్రయోజనం ఉండదని, దాని వల్ల చివరికి బాధే మిగులుతుందని ఈ పద్యం చెబుతుంది.

పదప్రయోగంలో నవయుగ కవి చక్రవర్తి జాషువాది ఒక అరుదైన, విశిష్టమైన శైలి. వీరి పద్యాలలో జాతిని ప్రబోధించే భావాలు, సామాజిక చైతన్యాన్ని కలిగించే కవిత్వం మనకు ఎక్కువగా కనిపిస్తాయి. వీరు రచించిన "ముంతాజమహల్" అనే కావ్యంలో కళ అనేది కులీనులకు, ఉన్నత వర్గాలకు మాత్రమే పరిమితం కాదని, కులం అనే భేదం లేకుండా అందరినీ ఆకర్షిస్తుందని, అందరినీ అక్కున చేర్చుకుంటుందని ఈ పద్యంలో స్పష్టం చేశారు.

కళలు మోహించు టొక కులీనుల కాదు
కులము లేదన్న వానినిఁ గూడవలచు
సత్కళాదేవతాకటాక్షంబు కతన
సమయు గావుత ముచ్చనీచతలబెడద

ఈ పద్యం ఒక సామాజిక విప్లవానికి ప్రతీక. కళకు కులం, మతం, ఆర్థిక అంతరాలు తెలియవని చెప్పడానికి "కులము లేదన్న వానినిఁ గూడవలచు" అనే పదం వాడారు. ఇక్కడ "కూడవలచు" అనే పదబంధం కళ యొక్క ప్రేమను, ఆలింగనాన్ని సూచిస్తుంది. "సత్కళాదేవతాకటాక్షంబు కతన" అనే పదబంధం చాలా శక్తివంతమైనది. ఇక్కడ కళను ఒక దేవతగా అభివర్ణించారు. ఆ దేవత యొక్క కటాక్షం అంటే ఆశీర్వాదం లేదా దయ ఉన్నచోట...ఈ భేదాల బెడద పూర్తిగా తొలగిపోవాలి అని జాషువా ఆకాంక్షించారు.

ఇది కేవలం కళా రంగంలో మాత్రమే కాకుండా సమాజంలో కూడా ఈ కుల వివక్ష, అసమానతలు నశించాలని ఆయన చేసిన ప్రార్థన. ఈ పద్యం ద్వారా జాషువా కళలను కేవలం వినోద సాధనాలుగా చూడకుండా, సమాజాన్ని సంస్కరించే సాధనాలుగా పేర్కొన్నారు. కళలు సమానత్వాన్ని బోధించి, సమాజంలోని అన్ని రకాల వివక్షలను తొలగించగలవని ఆయన బలంగా విశ్వసించారు. తద్వారా కళల ద్వారా సామాజిక న్యాయం, సమానత్వం సాధించవచ్చని ఈ పద్యం ద్వారా నిరూపించారు.

అణగారిన వర్గాల బాధను, వారి శ్రమ దోపిడీని, దారిద్ర్యాన్ని, వివక్షను అద్దంలో చూపించినట్లుగా చిత్రీకరించిన ఒక కళాఖండం 'గబ్బిలం'. ఈ కావ్యంలోని మొదటి భాగంలోని ఈ పద్యం ద్వారా జాషువా గారు సమాజంలోని కులవివక్షపై తీవ్రమైన విమర్శ చేసి, దాన్ని అంతం చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. అందుకే ఈ పద్యం తెలుగు సాహిత్యంలో ఒక కోహినూర్ వజ్రంలా నిలిచిపోయింది.

ఆ యభాగ్యుని రక్తంబు నాహరించి
యినుపగజ్జెల తల్లి జీవనము సేయుఁ
గసరిబుసకొట్టు నాతని గాలి సోఁక
నాల్గు పడగల హైందవ నాగరాజు

ఆనాటి సమాజంలో నెలకొన్న అంటరానితనం, కులవివక్ష, పేదరికం వంటి సామాజిక రుగ్మతలపై జాషువా హృదయపు లోతుల్లోనుంచి వెలువడిన ఒక నిప్పురవ్వ ఈ పద్యం. ఈ పద్యంలో వాడిన ప్రతి పదానికి అనేక లోతైన అర్థాలు ఉన్నాయి.

"ఆ యభాగ్యుని రక్తంబు నాహరించి" అన్నప్పుడు, ఇక్కడ 'అభాగ్యుడు' అంటే కులవివక్షకు గురైన ఒక పేదవాడు. అతని రక్తం అంటే కేవలం రక్తం మాత్రమే కాదు, అతని శ్రమ, కష్టం, జీవితం, ఆత్మగౌరవం. ఆ అణగారినవాడి జీవితాన్ని, కష్టాన్ని ఎవరో ఒకరు దోచుకుంటున్నారని పద్యం ప్రారంభంలోనే సూచించారు జాషువా.

"యినుపగజ్జెల తల్లి జీవనము సేయుఁ" ఈ వాక్యంలో కూడా అనేక లోతైన అర్థాలు ఉన్నాయి. "ఇనుపగజ్జెల తల్లి" అంటే ఇక్కడ దరిద్రదేవత, పేదరికం అని ఒక అర్థం. ఆ అభాగ్యుని రక్తాన్ని పీల్చి బతికేది మరేదో కాదు, ఈ పేదరికమే. కుల వివక్ష, అణచివేత ఫలితంగా ఆ అభాగ్యుడు దరిద్రంలోనే జీవిస్తున్నాడు అని జాషువా ఆవేదన చెందారు.

"కసరిబుసకొట్టు నాతని గాలి సోఁక" ఇది అంటరానితనం యొక్క అత్యంత క్రూరమైన రూపాన్ని తెలియజేస్తుంది. ఆ అభాగ్యుని శరీరాన్ని తాకడం అటుంచితే, అతడు పీల్చే గాలి కూడా సోకడానికి ఇష్టపడకుండా, కసిరి బుసకొట్టేది ఎవరో తర్వాతి వాక్యంలో తెలుస్తుంది. ఇది ఆనాటి సమాజంలో ఉన్న అత్యంత కఠినమైన అంటరానితనాన్ని సూచిస్తుంది.

"నాల్గు పడగల హైందవ నాగరాజు". ఈ వాక్యం ఈ పద్యానికి గుండెకాయలాంటిది. "నాలుగు పడగల నాగరాజు" అంటే హిందూ సమాజంలోని చాతుర్వర్ణ వ్యవస్థ (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర). ఈ వర్ణ వ్యవస్థను విషంతో నిండిన పాముతో పోల్చి, అది ఎంత ప్రమాదకరమైనదో, ఎంత అమానవీయమైనదో శక్తివంతంగా తెలియజేశారు జాషువా.

జాషువా జీవితం పట్ల అభ్యుదయ దృక్పథం గలవాడు. మూఢాచారాలు, మత దాంబిక ఉత్సవాలు ఆయనకు గిట్టేవి కాదు. తన కుటుంబంలో కూడా ఇలాంటివి జరగడానికి ఇష్టపడేవాడు కాదు. తన రచనలలో ఉదారవాదిగా కనపడవచ్చు గాని ఆచరణలో ఆయన పూర్తి నాస్తికుడు. ఆయనలో కొన్ని తిరుగుబాటు లక్షణాలు కనబడతాయి. పాత విలువల్ని, కుహనా సంస్కృతుల్ని ధ్వంసం చేయాలనే పరిణామ దృష్టి ఆయనలో కనబడుతుంది. ఇందుకు ఉదాహరణగా హేమలతా లవణం గార్ల వివాహమే.


కడు పేదరికం నుండి వచ్చిన వ్యక్తి.. పట్టుదలతో, కార్యదీక్షతో పద్మభూషణ్ దాకా ఎదిగి, ఎన్నో సాంఘిక సమస్యలను చాలా సరళమైన భాషలో అచ్చ తెలుగులో సమాజానికి పట్టి చూపి, తెలుగు నేలపై తన ముద్రను దశాబ్దాలుగా పరిచిన జాషువా గారికి 130వ జన్మదిన నివాళులు.



- విల్సన్ రావు కొమ్మవరపు
89 85 43 55 15

# లోయలు పర్వతాల కవిత్వమే నేపాలీ కవి అబూ సుబేది జీవితం

ప్రకృతిని ప్రేమించే జీవజాలంలో సహజంగానే సృజనకారులు కళాకారులది ముఖ్య భూమిక. నేపాల్ హిమాలయ సానువుల్లో భూమిపైన కొండలు, కింద లోయలు కనువిందు చేసి కవుల మనసు తమ వశం చేసుకోవడమే ప్రేరణలోనిదే కవిత్వం. కవిత్వంలో జీవితం,జీవితంలో కవిత్వం అల్లకున్న కలం ప్రముఖ నేపాలీ కవి,నాటక రచయిత భాషావేత్త విద్యావేత్త డా. అబూ సుబేది. సుబేది కలంలోంచి ఎక్కువగా విమర్శ, నాటకాలు, అనువాదాలున్నా కవిత్వం పదునుగా లోతులు తాకి మేల్కొల్పుతుంది. అతడు రచించిన 'ఫరెవర్ అరైవింగ్' గ్రంథంలోని ఒక స్టాంజాకు నా తెలుగు సేత. 'నా పదాలను నేను శక్తి భరితం చేస్తాను/ సూర్యకాంతి వాయుశక్తితో/వాటినే ఆలపిస్తానూ/లోయల లోతుల అంతరాళాల్లో''. ఇది గాఢత, విస్తృతి,లోతు శక్తిభరిత అక్షరపోత భావ అభివ్యక్తితో కవి పెన్ స్ట్రోక్ పాఠకులను ఆకట్టుకునే మార్మికత గల గొప్ప రచన.
నేపాలీలో అగ్నికో కథ,తీన్ నాటక్,ఆంగ్లంలో ఫరెవర్ అరైవింగ్,ఛేజింగ్ డ్రీమ్స్ కవిత్వంతో కలిపి వివిధ విభిన్న ఇతివృత్తాలతో దాదాపు 25 పైబడిన రచనలు చేసిన అబూ సుబేది ద్వి భాషా కవి,రచయిత.ఆయన రాసిన కవిత 'సాఫ్ట్ స్టార్మ్' నేపాలీ జాతీయ గ్రంథాల భాగంగా 12వ,తరగతి విద్యార్థులకు బోధిస్తున్నారు.
"స్వేచ్ఛగా ప్రవహించే భావోద్వేగాల స్వేచ్ఛా వచన సృజన సుబేదిది. అవి ఏ ఇతర కలాలనూ అనుసరించని స్వీయ శైలి" అని అనుభవైక సాహిత్య వేత్తలు అంటారు."శైలి ఇతివృత్తంలోనూ సంప్రదాయం నుండి పాశ్చాత్యం వైపు వాలుతాయనీ" అంటారు ప్రముఖ సాహిత్యకారులు.



ఇక ఉత్తర నేపాలీ ప్రాంతంలోని తెర్హాతం జిల్లా,సబ్లా గ్రామంలో జూన్ 30,1947న జన్మించిన అబూ నారాయన్ సుబేది చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయాడు. ఉన్నత విద్యను అభ్యసించిన తర్వాత రీడింగ్ సబ్‌లమేహీ ఫుల్ కేర్ కాలేజీ లో కళాశాల విద్యను లెల్ధరన్ ఝురాల్ నూ పూర్తి చేశాడు. అబూ సుబేది ఇడెన్బర్గ్ యూనివర్సిటీ, స్కాట్లాండు, యు.కే లో 1978లో ఎం.ఎ., స్టైలిస్టిక్ అండ్ అప్లైడ్ భాషాశాస్త్రంపై అలాగే నేపాల్ లోని కీర్తిపూర్ త్రిభువన్ విశ్వవిద్యాలయంలో, ప్రాగ్మాటిక్ పోయట్రీ పై ఇంగ్లీష్ సాహిత్యంలో పి.హెచ్ డి చేసిన ప్రాక్టికల్ అకాడమీషియన్. ఆయన అకడమిక్స్ పై తనకు ఎంత అమితమైన గౌరవమో అంతే భాధ్యత ఉన్న గొప్ప కవి,నాటక రచయిత, అనువాదకుడు. అంతేకాదు ఆయనలో ఓ భాషావేత్త ఓ విమర్శకుడు కూడా ఉన్నారు.అయన త్రిభువన్ యూనివర్సిటీలో దాదాపు నాలుగు దశాబ్దాలు వివిధ హోదాల్లో పనిచేసి ప్రొఫెసర్, శాఖ హెచ్.ఓ.డిగా రిటైర్ అయ్యారు. ఆయన 'సాఫ్ట్ స్టార్మ్' దీర్ఘకవిత హైస్కూల్ విద్యార్థులకు బోధనాంశంగా సిలబస్‌లో ఉండడం భావితరానికి స్ఫూర్తి. అందులో కొంత భాగం నా అనువాదంతో ఇక్కడ

**"సున్నిత తుఫాన్" (దీర్ఘ కవిత)**

'నేను సున్నితమైనాను,/
నేను సున్నితమైనాను./
ఎప్పుడైతే భీకర శబ్దాలు విన్నానో, అప్పుడే లోతైన నిశ్శబ్దాలనూ/

నేను మెత్తబడ్డాను/
ఎప్పుడైతే ఆకాశం /పూలలా గట్టి రాళ్ళపై వికసించిందో,/ అదే రాత్రి/
ఎప్పుడైతే చంద్రుడు
మీ గోడల గుసగుసల పోస్టర్ల కిందకు జారిండో'./

"నేను మెత్తబడ్డాను/
రక్త మరకల అంగీ భూమిపై పడివుండడం చూసా ,/
మనిషి పెదవుల గాయాలబాధ / భూమి చెవిలో
దూరాన/ ఓ మూల మాట్లాడడం/
చరిత్రలో, కలల చంద్రుని/ దాగుడుమూతల ఆటను/
మ్యూజియంలో నేను చూసినప్పుడు"/

నేను సున్నితమయ్యాను/
నీవు నాకు మాటలిచ్చినందుకు,/
కానీ ఎప్పుడూ వినలేదు/
నీవు తుఫానును తెచ్చావు/
కానీ నిలువలేదు ఎప్పుడూ/
అవి ఏమి సృష్టించాయో చూసేందుకు/

నా సున్నిత తుఫాన్/ నాట్యం చేస్తుంది/నీ హృదయ బాధల లహరులపై/

అబూ సుబేది సున్నిత తుఫాన్ కవితలో గుర్తులు,దృశ్యాలు అభివ్యక్తి మిళితాలు ఎక్కవ. ఆధ్యాత్మిక సంకేతాలు,వ్యంగ్య చిత్రణ, రూపక అలంకారం, విభిన్నమైన సామాజిక రాజకీయ కోణంలో ఉద్బోధ ఉంటుంది. అగ్నికో కథ నేపాలీలో అబూ సుబేది రచించిన నాటకం. ఆరోహన్ థియేటర్ 2003లో మొదటిసారిగా అగ్నికో కథను స్టేజ్ షో కోసం సిద్ధం చేసి, ఖాట్మండులోని సొంత థియేటర్‌లో ప్రదర్శించారు. తరువాత, ఇతర ఆసియా దేశాల్లో ఐరోపాలో ప్రదర్శనలకై నాటకాన్ని విదేశాలకు తీసుకెళ్లారు. అబూ సుబేది నేపాలీలోని అగ్నికో కథ నాటకం ప్రపంచ ప్రసిద్ధిగాంచింది. అందులో స్త్రీవాద తాత్వికత సామాజిక చింతన ఎక్కువగా ఫోకస్ పాంట్ గా ఉండి ఆయనలోని స్త్రీవాద సమానత్వానికి అద్దంపడుతుంది.నేపాలీ ఇంగ్లీష్ సాహిత్యాలలో ఆయన బహుగ్రంథ రచయిత. గొప్ప విద్యావేత్తగా, ప్రొఫెసర్ గా ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన ఘనత అబూ సుబేదిదే. ఆయన రచనలు భావి తరాలకు దీప స్తంభాలు.జ్ఞాన దారులు.

- డా.టి.రాధాకృష్ణమాచార్యులు
98493 05871





## యాంబియన్స్ ఫోర్ట్ లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు

**రాజేంద్రనగర్ మహా ;** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధి అత్తాపూర్ లోని యాంబిన్స్ ఫోర్ట్ లో అనఅధికార నిర్మాణాలు, టౌన్ ప్లానింగ్ ఉల్లంఘనలు జరుపుతూ నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. మున్సిపల్ అనుమతుల దుర్వినియోగము అవుతున్నా, రాజేంద్రనగర్ సర్కిల్ జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు ఉలుకు పలుకు లేకుండా ఉండిపోయారు. ప్రభుత్వ నియమాలను ఉల్లంఘించిన పట్టించుకునే దాఖలాలు లేవు, టౌన్ ప్లానింగ్ అధికారులు లంచాలకు మరిగి 150,200, గజాల్లో అనుమతులు బేఖాతరు చేస్తూ సేట్ బ్యాక్ లేకుండా నిర్మాణాలు నిర్మిస్తున్నారు. చిన్న చిన్న స్థలాల్లో సేట్ బ్యాక్ లేకుండా బహుళ అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నాయి. రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి అధికారులు చూసి చూడనట్టు వదిలేస్తున్నారు. ముందు జాగ్రత్తగా సంబంధించిన విధి విధానాలు లేకుండా ఇష్టానుసారంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. వీటిపై ఉన్నత అధికారులు స్పందించి భవిష్యత్తు లో సంభవించే ప్రమాదాలను అరికట్టాలి. అనుమతులు సెట్ బ్యాక్ లేకుండా నిర్మిస్తున్న నిర్మాణాలను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ఆదర్శ ప్రాయుడు కొండాలక్ష్మణ్ బాపూజీ - కలెక్టర్



**ఆదిలాబాద్ మహా :** కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు ఆకాంక్షలకనుగుణంగా నడుచుకోవలసిన అవసరముందని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. బాపూజీ 13వ వర్ధంతి సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రం లోని కొండా లక్ష్మణ్ బాపూజీ చౌక్ లో గల విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే ఊపిగా బతికిన మహనీయుడు కొండాలక్ష్మన్ బాపూజీ అని కొనియాడారు. తొలిదశ తెలంగాణ ఉద్యమ సమయంలో తన పదవిని తృణప్రాయంగా భావించి త్యజించిన గొప్ప తెలంగాణ త్యాగశీలి అని అన్నారు. ఆయన ఆకాంక్షలమేరకు సాధించిన తెలంగాణలో మంచి సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో ప్రజాపాలన సాగుతుందన్నారు.



## మున్సిపాలిటీలో పారిశుద్ధం పడకేసింది


### సీపీఎం నాయకులు మల్లేష్

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కొత్వాల్ గూడ జె ఎన్ ఎన్ యు ఆర్ కాలనీ రాజీవ్ గృహకల్ప లో నివసిస్తున్న ప్రజల సమస్యలపై కాలనీ అసోసియేషన్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఎం పార్టీ మండల కార్యదర్శి నీరటి మల్లేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ. రాజీవ్ గృహకల్ప లో నివసిస్తున్న కుటుంబాలను ప్రభుత్వ అధికారులు గాలికి వదిలేసారు. శంషాబాద్ మున్సిపాలిటీ లో పారిశుద్ధం పడకేసింది. రాజీ గృహకల్పలో నివసిస్తున్న ప్రజల బతుకులు మౌలిక సదుపాయాలు లేక ఇబ్బంది పడుతున్నారు. వీరి బతుకు బురద కుంటల్లో బతుకుతున్నట్టుంది. కనీస మౌలిక సదుపాయాలు లేక నానా అవస్థలు పడుతున్నారు. ఇక్కడి కి రావడానికి పోవడానికి రోడ్డు లేదు మంచి నీరు లేదు, అభివృద్ధి లేకుండా ప్రభుత్వ అధికారులు ఇక్కడి ప్రజలను గాలికి వదిలేశారు. ఈ కాలనీ సందులలో వాకిట్లో పందులు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. శంషాబాద్ మున్సిపాలిటీలో పారిశుధ్యం పడకేసింది. కోత్వాల్ గూడ రాజీవ్ గృహకల్ప కాలనీ ని ప్రభుత్వ పెద్దలు అధికారులు సందర్శించి మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం నాయకుడు నిరటి మల్లేష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ గండిపేట మండల కార్యదర్శి ఎం అశోక్, నాగేష్ గౌడ్,శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మి ,మొయినుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## శరన్నవరాత్రులకు ఆలయాల ముస్తాబు

### రేపటి నుంచి దసరా ఉత్సవాలు.. 13 రోజుల పాటు వేడుకలు.. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు

**ఆమనగల్లు, మహా :** రోజుకొక అవతారంలో దుర్గామాత దర్శనం దేవీ శరన్నవ రాత్రోత్సవాలకు అమ్మవారి ఆలయాలు ముస్తాబుతున్నాయి. జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ఆమనగల్లు పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం, శ్రీ రాజరాజేశ్వరి దేవి సమేత శివభక్తమార్కండేయ స్వామి ఆలయం, కడ్తాల మండలంలోని మైసిగండి మైసమ్మ దేవత, శివ రామాలయాలతో పాటు శ్రీఅన్నపూర్ణేశ్వరీ మహాలక్ష్మి జ్ఞాన సరస్వతీదేవి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. నవరాత్రుల వేడుకల నిర్వహణకు భక్తుల సౌకర్యార్థం అలయాల కమిటీల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 22 నుంచి 13 రోజులపాటుశరన్నవరాత్రోత్సవాలనువైభవంగానిర్వహించనున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన మైసిగండి శివ రామాలయం మైసిగండి వద్ద భారీ ఏర్పాట్లుప్రముఖ పుణ్యక్షేత్రం కడ్తాల మండలంలోని మైసిగండి మైసమ్మ, శివరామాలయ దేవాలయాలు,శ్రీలన్నపూర్ణేశ్వరీ మహాలక్ష్మిజ్ఞానసరస్వతీదేవి అలయాలుశరన్నవరాత్రోత్సవాలకు ముస్తాబయ్యాయి.ఇక్కడ ఏటా ఆశ్వయుజ శుద్ధపాడ్యమి మొదలు శుద్ధ దశమి వరకు దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. ఇక్కడికి జిల్లా నలుమూలల నుంచేకాకుండా హైదరాబాద్తో పాటు చుట్టుపక్కల జిల్లాల నుంచి సైతం వేడుకలను తిలకించేందుకు భక్తులు తరలివస్తారు. మైసిగండి శివాలయం వద్ద 11 రోజులు నిర్వహించే ఉత్సవాలకు ఆలయ నిర్వాహకులు, దేవాదాయ శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం పందిళ్లు వేసి..తాగునీటి వసతి కల్పిస్తున్నారు. విద్యుత్



దీపాలతో ఆలయాన్నిఅలంకరిస్తున్నారు. మండప దర్శనానికి క్యూలైన్లు ఏర్పాటుచేస్తున్నారు.కల్వకుర్తి ,ఆమనగల్లు, హైదరాబాద్ల నుంచి మైసిగండికిఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ ఫౌండర్ ట్రస్టీ సిరోలీపంతూ, ఈవో స్నేహలత కోరారు.

**దివ్య అలంకారములు**

22 సోమవారం శ్రీ అన్నపూర్ణాదేవి, మంగళవారం శ్రీబాల త్రిపుర సుందరి, బుధవారం శ్రీ గాయత్రీ దేవి,గురువారం శ్రీ భవానీ దేవి,శుక్రవారం శ్రీ లలిత సుందరిదేవి, శనివారం శ్రీ మహాలక్ష్మి దేవి, ఆదివారం చండీహోమం, సోమవారం శ్రీ సరస్వతీ దేవి (మూలాశ్రీనక్షత్రం) మంగళవారం శ్రీ కనక దుర్గాదేవి (దుర్గాష్టమి)బుధవారం శ్రీ మహిషాసుర మర్ధిని దేవి, గురువారం శ్రీరాజేశ్వరి దేవిలుగా ప్రత్యేక రూపంలో కొలువుదీరనున్నారు. శ్రీ శివాలయ, రామాలయంలో ప్రత్యేక దర్శనాలు. శ్రీ కాశీవిశ్వనాథ స్వామి,శ్రీ కోదండ రామస్వామి,శ్రీ అన్నపూర్ణేశ్వరి దేవి శ్రీ విజయ గణపతి స్వామి,శ్రీ ఆంజనేయస్వామి,మహాలక్ష్మి దేవి అమ్మవారు,విజ్ఞాన సరస్వతి దేవి అమ్మవారు ,శ్రీనవగ్రహ మండపము, శ్రీ నాగ దేవత ఆలయం,ఆలయాల్లో భక్తులకు శరన్నవరాత్రి సందర్భంగా ప్రత్యేక దర్శనాలు కల్పించినట్లు ఈఓ తెలిపారు.

**ఆలయ ప్రత్యేకత**

మైసిగండి దేవాలయాలకు పూర్వంలోనే చరిత్ర కలిగి ఉందని, నవాబుల కాలంలోనే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు పూర్వీకులు తెలిపారని,అనంతరం పురాతన ఆలయాలను అభివృద్ధి పరిచేందుకు ఆమనగల్లు మాజీ ఎంపీపీ ఆర్.పంతు నాయక్, దాతలసహకారంతో ఆలయ అభివృద్ధికి స్వీకారం చుట్టారని,కొలిసిన వారికి కొంగు బంగారంలా కోరికలు తీర్చేఅమ్మవారు ఆలయం నిత్యం భక్తుల రద్దీతో కళకళలాడుతుంటుంది అని, ప్రభుత్వం దేవాదాయ శాఖఆధ్వర్యంలో సుమారు 23 సంవత్సరాలుగా రాష్ట్రంలో ప్రత్యేక ప్రసిద్ధి పొందిన ఆలయంగా గుర్తింపు పొందిందఅన్నారు.

## సింగరేణి లాభాల వాటా ఎప్పుడు ఇస్తారు సారు...?

### పండగ మీద పండగలు రాబట్టే... చేతిలో చిల్లి గవ్వలు లేకపాయే

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సింగరేణి కార్మికులు
ప్రేక్షక పాత్రలో యూనియన్లు, గుర్తింపు సంఘం

**మంచిర్యాల, మహా :** గత సంవత్సరం సింగరేణి లాభాలలో వాటా ఎప్పుడు ఇస్తారు సారు...? అని సింగరేణి కార్మికులు యాజమాన్యాన్ని, రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ప్రతి యేడు దసరా, దీపావళి పండుగల సమయంలో సింగరేణి లాభాల వాటాను కార్మికులకు పంచడం కొన్ని సంవత్సరాలుగా ఆనవాయితీగా వస్తుంది. కానీ ఈ సంవత్సరం ఇప్పటివరకు కాంగ్రెస్ రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం లాభాల వాటను ప్రకటించకపోవడం పట్ల కార్మికులు ఆందోళనకు గురవుతున్నారు. ఒకవైపు సింగరేణి గుర్తింపు సంఘం (ఏఐటియుసి) ప్రాతినిధ్య సంఘం (ఐ.ఎన్.టి.యు.సి), ఇతర 3 జాతీయ సంఘాలతో పాటు టీబీజీకేఎస్,ఐఎఫ్టియు సంఘాలు కార్మికులకు గత సంవత్సరం సింగరేణి లాభాల నుండి 35 శాతం వాటా కార్మికులకు పంచాలని డిమాండ్ చేస్తూ ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉన్నాయి. అయినప్పటికీ ఇటు సింగరేణి యాజమాన్యం అటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో పండుగలు ఎలా ఒడ్డెక్కుతాయోని కార్మికులు మనోవేదనకు గురవుతున్నారు. కార్మికులకు నెలవారి జీతభత్యాలు ఎక్కువగానే ఉన్నప్పటికీ అవి పిల్లల చదువుల వడ్డీ, అసలుకు, కొత్తగా వివాహమై ఇంటికి పండగ వేల వచ్చిన అల్లుడి లాంఛనాలకు, ఇన్కమ్ టాక్స్ రూపంలో నెలవారీగా 50 వేల రూపాయల పైచిలుకు జీవితంలో నుండి కోతపడుతున్న విషయం విదితమే. ఈ క్రమంలో పండగ పూట కొత్త బట్టలు, కొత్తగా వివాహమైన గృహానికి వచ్చిన కూతురు, అల్లునికి లాంఛనాలు ఈతరాత్రలు ఎలా ఎల్లతీయాలని కార్మిక కుటుంబాలు కూమిలిపోతున్నాయి. సింగరేణి ఉత్పత్తి ఉత్పాదకత వార్షిక లక్ష్యాలను సాధించేందుకు కార్మికులు, యూనియన్ నాయకుల కృషి ఎంతగానో ఉంటుంది. లక్ష్యాలను అధిగమించేందుకు సింగరేణి యాజమాన్యం వివిధ ఏరియాల జిఎంలతో ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూనే ఉంది. మరి ఈ నేపథ్యంలో సింగరేణి ఉత్పత్తి లక్ష్యాలపై ఉన్న శ్రద్ధ గత 202425 లాభాల వాటా కార్మికులకు పంచడంలో ఎందుకు లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఏది ఏమైనా కార్మికుల లాభాల వాటా హక్కు కాకపోయినప్పటికీ ప్రోత్సాహక బహుమతి ద్వారా మరింత ఉత్సాహంతో కార్మికులు ఉత్పత్తి లక్ష్యాలను సాధించే దిశగా పనిచేస్తారని ఎందుకు ఆలోచించడం లేదో తెలియవలసి ఉంది. లాభాల వాటను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం ఆలస్యం చేస్తే అది సింగరేణి కంపెనీకి నష్టమని చెప్పక తప్పదు. సింగరేణి సంస్థలో గడచిన కొన్ని సంవత్సరాలుగా సమ్మె లేని ఉత్పత్తి ఉత్పాదకత వార్షిక లక్ష్యాల సాధన అలవోకగా సాధిస్తూ వస్తుంది. ఈ క్రమంలో ఏదైనా సమస్య తలెత్తి సమ్మె రూపం దాలిస్తే ఆ సమస్యను పరిష్కరించడం తలకు మించిన భారమే అవుతుందని తెలుస్తోంది. ఇలాంటి సమస్యలు ఉత్పన్నం దాల్చక ముందే సింగరేణి యాజమాన్యం, సింగరేణి వాట పై చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది.

## ఘనంగా బతుకమ్మ సంబరాలు మొదలు...



**రాజేంద్రనగర్, మహా ;** రాజేంద్రనగర్ సర్కిల్ మైలర్ దేవ్ పల్లీ డివిజన్ పరిధిలోని లక్ష్మీగూడాలో విజేత టాలెంట్ స్కూల్ లో ప్రిన్సిపల్ జయరాజు ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు ఆదివారం నిర్వహించారు. బతుకమ్మ పాటలతో చిన్నారులు నృత్యాలు చేస్తూ సంతోషంగా ఆటపాటలతో గడిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అధ్యాపకులు, విద్యార్థులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ఆమనగల్లులో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలు

**ఆమనగల్లు, మహా :** ఆమనగల్లు పట్టణ కేంద్రంలో పద్మశాలి సంఘం అధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. స్వరాష్ట్రం కోసం పరితపించిన తెలంగాణవాది, నిబద్ధత కలిగిన రాజకీయ వేత్త అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ చేనేత ఐక్యవేదిక రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, చేనేత సహకార సంఘం అధ్యక్షులు గాజుల శ్రీనివాస్,ఎంపీడీవో కుసుమ మాధురి, తెలంగాణ జేఏసీ మండల నాయకులు అవ్వారి శివలింగం, అప్పం శ్రీనివాస్, భీమనపల్లి దుర్గయ్య,ఎంగలి బాలకృష్ణయ్య, ఎంగలి శ్రీధర్, పాలాది శ్రీనివాస్,ఎలే నిరంజన్ పాలాది పురుషోత్తం, మన్న అప్పి,అవ్వారి పాండు, పున్న చంద్ర మౌళి, చిలివేరు వాసుదేవ్, తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం వల్ల ఇతరుల ప్రాణాలను కాపాడవచ్చు

### మంచిర్యాల జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ప్రెసిడెంట్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మహా :** రక్తదానం చేయడంవల్ల ఇతరుల ప్రాణాలను కాపాడవచ్చని మంచిర్యాల జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ప్రెసిడెంట్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు జన్మదినం సందర్భంగా ప్రభుత్వ కాలేజ్ రోడ్డు పద్మనాయక కళ్యాణ మండపంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో సొసైటీ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా గర్భిణులకు ప్రసవ సమయంలో, రోడ్డు ప్రమాదాలకు గురైన వారికి అత్యవసర పరిస్థితులలో, సికిల్ సెల్ తల సేమియా వ్యాధిగ్రస్తుల ప్రాణాలు కాపాడవచ్చని అన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయవచ్చని అన్నారు. ఇలా రక్తం ఇవ్వడం వల్ల శరీరంలో నూతన రక్తం పెంపొంది ఆరోగ్యంగా ఉంటారని వెల్లడించారు. సికిల్ సెల్ తల సేమియా బాధితులకు రక్తం అవసరం ఎప్పటికీ ఉంటుందని చెప్పారు. చదువుకున్న యువత రక్తదాన శిబిరాలలో స్వచ్ఛందంగా పాల్గొని ప్రజల



ప్రాణ రక్షణలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. పోలీస్, ఇతర శాఖల వారీగా స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో రక్తదాన శిబిరాలు నిర్వహించి యూనిట్లను సేకరించి ప్రజల ప్రాణ రక్షణలో భాగస్వామ్యులు కావాలని ఆయన పిలుపునిచ్చారు. మెగా రక్తదాన శిబిరంలో స్వచ్ఛందంగా పాల్గొని రక్త దానం చేయడం అభినందనీయమని తెలిపారు. అనంతరం రక్తదాతలకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




## నిబంధనలకు విరుద్ధంగా కళాశాలలో బోధనలు

### శ్రీ చైతన్య కళాశాలపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు చరణ్ గౌడ్ డిమాండ్

**రంగారెడ్డి జిల్లా మహా:** ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి ఆదివారం తరగతులు బోధిస్తున్న శ్రీ చైతన్య కళాశాల పై, అధికారులు వెంటనే చర్య తీసుకోవాలని, రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యుడు చరణ్ గౌడ్ డిమాండ్ చేశారు. రాజేంద్రనగర్ పరిధి, మణికొండలోని శ్రీ చైతన్య కళాశాల యాజమాన్యం, విద్యార్థులను ఆదివారం కూడా కళాశాలకు రావాలని ఒత్తిడి చేస్తున్నారని, లేదంటే ప్రాక్టికల్స్ లో మార్కులు తగ్గిస్తామని బెదిరిస్తున్నారని అన్నారు. విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తే సహించేది లేదని ఎస్ఎఫ్ఐ నాయకులు, కళాశాల యాజమాన్యాన్ని హెచ్చరించారు. ఈ సందర్భంగా వాళ్లు మాట్లాడుతూ... సెలవు రోజుల్లో తరగతులు నడపడంతో విద్యార్థులు మానసిక వేదనకు లోనవుతున్నారు. ఆదివారం కూడా తరగతులు బోధిస్తూ విద్యార్థులను ఇబ్బంది పెడుతున్న కళాశాల పై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. లేని పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. విద్యార్థులను ఒత్తిడికి గురై మానసికంగా ఇబ్బంది పడుతున్నారని, విద్యార్థులు తమకు ఫోన్ చేసి ఏడుస్తున్నారని ఎస్ఎఫ్ఐ నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సాయి, కార్తీక్, శివ తదితరులు పాల్గొన్నారు.

## పట్నం డిగ్రీ కళాశాలలో ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు

### ఉత్సాహంగా పాల్గొన్న మహిళా ఉద్యోగులు విద్యార్థినిలు

సాంస్కృతిక విభాగం వారు ఘనంగా నిర్వహించారు
కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్ రాధిక



**రంగారెడ్డి జిల్లా మహా:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇబ్రహీంపట్నం "సాహిత్య, సాంస్కృతిక విభాగం" ఆధ్వర్యంలో కళాశాలలో తెలంగాణ రాష్ట్ర పండుగ "బతుకమ్మ ఉత్సవాలు" ఘనంగా నిర్వహించబడ్డాయి. కళాశాల ఆవరణ నుండి మహిళా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినిలు బతుకమ్మలు తయారు చేసి, బతుకమ్మ పాటలు పాడి ఆడి, సమీపంలోని చెరువులో నిమజ్జనం చేసి, అమ్మవారి ఆశీస్సులను అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.ఎస్ రాధిక మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన బతుకమ్మ పండుగ అందరి జీవితాల్లో ఆనందాన్ని నింపాలని తెలిపారు. కళాశాల సాహిత్య, సాంస్కృతిక విభాగ కన్వీనర్, తెలుగు సహాయ ఆచార్యులు డాక్టర్ చింతల రాకేశ్ భవాని మాట్లాడుతూ... బతుకమ్మ పండుగ ప్రాశస్త్యాన్ని వివరించారు. బతుకమ్మ పాటలు పాడి అందరినీ అలరించారు. సాహిత్య, సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో గత సంవత్సరం నిర్వహించిన కార్యక్రమాలను వివరించారు. అందంగా తయారు చేసిన బతుకమ్మలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సురేష్ అధ్యాపకులు శ్రీకృష్ణ, డీవీ రావు, డీఎస్ఎస్ఆర్.కృష్ణ,డా. రవి కుమార్, నరేందర్ రెడ్డి, డా.వీరా రెడ్డి, డా. నర్సింగరావు డా.రమేష్, హృదయరాజు, పవన్, సురేష్, మాధవి, డా.రచన, డా.నీలిమ, డా.శంకర్, ప్రసాద్, వంశీ, గణేశ్, సాయి, సునీతలు పాల్గొన్నారు.

## సముచిత స్థానం దక్కేనా??

### 26 ఏళ్లుగా కల్వకుర్తి కాంగ్రెస్ లో క్రియాశీలక పాత్ర


మైసిగండి శ్రీనివాస్ గౌడ్ కి నామినేటెడ్ పదవి ఖాయమేనా??
నెలాఖరిలోపు నామినేటెడ్ పదవి దక్కుతుందంటూ జోరుగా చర్చ
రాష్ట్ర ప్రభుత్వం నుండి ఇప్పటికే సంకేతాలు అందాయా...?

**అమనగల్లు, మహా :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో కల్వకుర్తి నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీలోని ముఖ్య నాయకులు నామినేటెడ్ పదవులపై భారీ ఆశలుపెట్టుకున్నారు.26సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక పాత్ర పోసిస్తున్న కడ్తాల్ మండలం మైసిగండి గ్రామానికి చెందిన అయిల్ల శ్రీనివాస్ గౌడ్ కి నామినేటెడ్ పదవి దక్కనుందని నియోజకవర్గం వ్యాప్తంగా చర్చ మొదలైంది. ఈ నెలాఖరిలోపు నామినేటెడ్ పదవి దక్కనుందని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంకేతాలు అందినట్లు శ్రీనివాస్ గౌడ్ అభిమానులు చర్చించుకుంటున్నారు. 26 సంవత్సరాలుగా పార్టీని నమ్ముకున్న వ్యక్తి ::దివంగత పంతునాయక్ ఆధ్వర్యంలో 1994లో కాంగ్రెస్ పార్టీలో చేరిన అయిల్ల శ్రీనివాస్ గౌడ్ ప్రస్తుతం పీసీసీ సభ్యులుగా కొనసాగుతున్నారు.20062014సంవత్సరాలలో మైసిగండి ఎంపీటీసీగా,2013లో ఉమ్మడి కడ్తాల్, ఆమనగల్లు పిఎసిఎస్ చైర్మన్ గా కొనసాగారు. ప్రస్తుత ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి గెలుపులో ముఖ్య పాత్ర పోషించారు.



కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో నామినేటెడ్ పదవి ఇవ్వాలని ఆయన అనుచరులు ఆశిస్తున్నారు. రాష్ట్ర స్థాయి నామినేటెడ్ గా :: సిడబ్ల్యూసి ప్రత్యేక ఆహ్వానితులు, ఏఐసీసీ కార్యదర్శి, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్ రెడ్డి ముఖ్య అనుచరుడిగా పేరు ఉన్న అయిల్ల శ్రీనివాస్ గౌడ్ కు రాష్ట్ర స్థాయి నామినేటెడ్ దక్కనుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం సామాజిక సమీకరణాల దృష్ట్యా మొదటి విడత నామినేటెడ్ పదవిలో చోటు దక్కలేదు. కానీ రెండవ విడత నామినేటెడ్ పదవుల భర్తీ ఈ నెలాఖర లోపు రావచ్చని, ఆ పార్టీలో మైసిగండి శ్రీనివాస్ గౌడ్ పేరు ఉండటం ఖాయమేనని నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృతంగా చర్చించుకుంటున్నారు.

# స్కేటింగ్ క్రీడలతో పిల్లలు మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందించాలి



**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్, మహా :** శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎస్, కె,ఎస్ స్కేటింగ్ గ్రౌండ్‌లో ఆదివారము మహబూబ్‌నగర్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ఆసక్తిగా పోటీలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కేటింగ్ వంటి క్రీడల ద్వారా పిల్లలు మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. పోటీలలో స్కేటింగ్ క్రీడాకారులు తమ ప్రతిభను కనబరిచిన మొదటి, రెండు, మూడు స్థానాలను గెలుచుకున్న క్రీడాకారులకు ఆయన మెడల్స్, సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటేష్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ సుష్మారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ గోపాల్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు మహేందర్ రెడ్డి,నిర్వాహకులు, క్రీడాకారుల, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# అమృత కన్‌స్ట్రక్షన్ లీలలు...

## చారిత్రాత్మక బూల్కాపూర్ నాలను కబ్జా చేసి రోడ్డు
## బడా బాబుల కబ్జాలను పట్టించుకోని హైడ్రా

**రాజేంద్రనగర్ మహా ;** మణికొండ మున్సిపల్ పరిధిలోని మర్రిచెట్టు సమీపంలో అమృత కన్‌స్ట్రక్షన్ కంపెనీ బూల్కాపూర్ నాలాను కబ్జా చేసి రోడ్డుగా వాడుతున్నారు. పేదల ఇళ్లపై బుల్డోజర్ల ఎక్కిస్తున్న హైడ్రా అధికారులు, బడా బాబులు దర్జాగా నాలాను కబ్జా చేసిన హైడ్రా అధికారులు అటు పక్కకు తొంగి చూడలేదు. ఇందులో ఆంతర్యం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కేవలం పేదల కోసమే రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాని రంగంలోకి దించినట్టు కనిపిస్తుందని స్థానికులు వాపోతున్నారు. బూల్కాపూర్ నాలా స్పష్టంగా పూడ్చి రోడ్డు వేసినట్టు కనిపిస్తున్నా. నిర్మాణాలు జరుగుతున్న ఇప్పటివరకు అధికారులు పట్టించుకోకుండా వ్యవహరించడం అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నట్లు కనిపిస్తుందని స్థానికులు మండిపడుతున్నారు. నాలాను సంరక్షించే సమయం కాలేదుఅంటూ చమత్కరిస్తున్నారు. అధికారుల అలసత్వానికి నిలువెత్తు నిదర్శనంగా అమృత



కన్‌స్ట్రక్షన్ కంపెనీ నిర్మాణాలు. అమృత కంపెనీకి క్షేత్రస్థాయిలోవెళ్లి పరిశీలించకుండా అనుమతులు ఎలా ఇచ్చారు అనే సందేహం రాకమానదు. ఇప్పటికైనా హైడ్రా ఉన్నత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి బూల్కాపూర్ నాలను సంరక్షించాలి.

# బాధ్యత మరిచి.. కాలయాపన

**రాజేంద్రనగర్ మహా ;** మణికొండ మునిసిపల్ పరిధిలోని అలకాపూర్ టౌన్షిప్ లోని కాలనీలలో అక్కరకు రాని కేబుల్ వైర్లను తొలగించి ఎక్కడి అక్కడే పడి వేయడంతో కాలనీ వాసులు హరిహర నాథ్ రెడ్డి, వసిరెడ్డి శ్రీనివాస్ రావు, దాసరి విశ్వనాథ్ లు చిన్నపిల్లలు, వృద్ధులు, జంతువులు, కేబుల్ వైర్లు కాళ్ళకి తగిలి ప్రమాదాలకు గురవుతారు. ఈ కేబుల్ వైర్ లను తీయాలని మునిసిపల్ అధికారీ, డివిజనల్ ఇంజనీర్లును కలువగా ఆ పని విద్యుత్ శాఖ అధికారులదంటు సమాధానమిచ్చారు. విద్యుత్ అధికారులకు సమస్యను తెలుపగా విద్యుత్ అధికారులు వైర్లు తొలగించాం తీసుకెళ్లే బాధ్యత తమది కాదని కరాకండిగా చెప్పేశారు. సమస్యను తామే పరిష్కరించే దిశగా విద్యుత్ వైర్లను ఆటోలో వేసి అక్కడినుంచి తీసుకెళ్లామన్నారు. ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటూ బాధ్యతను అధికారులు మార్చారని స్థానికులు వాపోయారు.



# ఘనంగా అమ్మవారి ఆగమాన్ కార్యక్రమం

**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు మున్సిపల్ పరిధిలోని శ్రీ దుర్గా భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అమ్మవారి ఆగమన్ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. టపాకాయలు కాల్చి, డప్పు వాయిద్యాల నడుమ జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



# పట్నంలో భారీ వర్షం ఇండ్లలోకి వరద నీరు


**రంగారెడ్డి జిల్లా మహా:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఇబ్రహీంపట్నం కేంద్రంలోని కుమ్మరి కుంట కాలనీ జలమయమై ఇళ్లు, షాపుల్లోకి వరద నీరు చేరింది. దీంతో దుకాణంలోని వస్తువులు తడిసి ముద్దాయి. దీంతో స్థానికులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రం నుంచి కురుస్తున్న వర్షానికి మున్సిపల్ అధికారులు ఫోన్ చేసిన స్పందించడం లేదని, చిన్న పిల్లలతో భయం భయంతో గడుపుతున్నామని ఆవేదన చెందారు. అధికారులు వెంటనే స్పందించి వరద నీటిని దారి మళ్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇంటి చుట్టుపక్కల ప్రాంతాలలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, విష జ్వరాల బారిన పడకుండా అవసరమైన జాగ్రత్త పడాలని అధికారులు ప్రజలకు సూచించారు.



# పూల రంగులతో బతుకమ్మలు

## బురద నీటిలో నిమజ్జనాలు

**ఆమనగల్లు, మహా:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పూలనే దైవంగా పూజించే విశిష్టమైన పండుగ బతుకమ్మను ప్రతి గ్రామాన అంగరంగ వైభవంగా నిర్వహించుకుంటారు. కానీ ఆమనగల్లు మున్సిపల్ కేంద్రంలో ఆదివారము ప్రారంభమైన ఎంగిలిపూల బతుకమ్మ నిమజ్జనాల ఏర్పాటులో మున్సిపల్ శాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో పవిత్రంగా దైవంగా భావించే బతుకమ్మను బురద నీటిలో నిమజ్జనం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందా అని మహిళలు చర్చించుకున్నారు. ప్రతి సంవత్సరము ఆమనగల్లు మున్సిపల్ కేంద్రంలో ఎంగిలిపూల బతుకమ్మ నిమజ్జన కార్యక్రమాన్ని సురసముద్రంలో ఒక ప్రాంతంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసేవారు. కానీ ఈ సంవత్సరము పాలకవర్గం లేకపోవడమా...అధికారులు లేక పోవడమా... ఏర్పాట్లలో నిర్లక్ష్యమా అని మహిళలు బహిరంగంగానే చర్చించుకున్నారు.









# సంతోషాలతో ఎంగిలి పూల బతుకమ్మ పండుగ

**తీరొక్క పూలతో కొలువుదీరిన బతుకమ్మ.. జిల్లాలో సురువైన బతుకమ్మ సంబరాలు.. సద్దుల బతుకమ్మ వరకు ఉత్సవాలు**

**రంగారెడ్డి జిల్లా మహా:** పూలను పూజించి ప్రకృతిని ఆరాదించే వేడుక తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ పండుగ. తెలంగాణ ఆడపడుచులు ఆదివారం ఎంగిలి పూల బతుకమ్మ పండుగ సంబరాలను, మహిళలు సంతోషాలతో ఘనంగా జరుపుకోవడం జరిగింది. రాష్ట్ర ప్రత్యేకతకు నిలువుటద్దంగా మారిన బతుకమ్మ పండుగ. ఆదివారం ఎంగిలిపూల బతుకమ్మతో సంబరాలు సుర్వయ్యాయి. పది రోజులపాటు నిర్వహించే ఈ బతుకమ్మ ఒక్కొక్క రోజు ఒక్క రూపంలో దర్శనమిస్తూ ప్రజలు కోరిన కోరికలు నెరవేర్చే ఇలవేల్పుగా బతుకమ్మ కొలువుదీరునుంది. మహిళలు ప్రత్యేక శ్రద్ధ వహించి, అడవికి వెళ్లి తంగేడు పూలు, గునుగు, ఉప్పు పువ్వు వంటి తీరొక్క రకరకాల పువ్వులు తెచ్చి, ఇంట్లో పువ్వు పువ్వు పేర్చుకుంటూ బతుకమ్మను తయారు చేసి, పూజలు చేసి, సాయంత్రం వేళలో మహిళలందరూ బతుకమ్మలతో ఒక చోటికి చేరి, బతుకమ్మల చుట్టూ గుమ్మిగా తిరుగుతూ "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో... బంగారు బతుకమ్మ ఉయ్యాలో"... అంటూ అమ్మవారిని తలుచుకుంటూ ఆటపాటలతో ఆడి పాడి... గౌరీదేవి స్వరూపమైన బతుకమ్మను కొలనులో వదులుతూ.. ఆడపడుచులు తమలోని కోరికలను కోరుకుంటారు. ఈ యొక్క బతుకమ్మ పండుగను జిల్లాలో ఘనంగా జరుపుకున్నారు. బతుకమ్మ పండుగ సంబరాలు మొదలు కావడంతో పూల ధరలు ఆకాశాన్ని అంటాయి. బతుకు నేర్పిన బతుకమ్మను తయారు చేసేందుకు పూలు కావలసి ఉంటుంది. ఈ బతుకమ్మ కొందరికి పూల అమ్మకాలతో బతుకునిస్తుంది. పూలు అమ్ముతూ జీవనాన్ని గడుపుతున్నారు. అలంకరణలో ప్రత్యేకమైన బంతిపూలు... ఇబ్రహీంపట్నం మార్కెట్లో కిలో వంద రూపాయల వరకు అమ్ముతున్నారు. ఎంగిలి పూల బతుకమ్మ, సద్దుల బతుకమ్మతో పాటు, అమ్మవారి శరన్నవరాత్రులలో పూల వాడకం ఉండడంతో, వాళ్ల జీవనోపాధి కొనసాగుతుందని వ్యాపారులు అంటున్నారు.
















# మాజీ సీఎం కేసీఆర్ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిల దిష్టిబొమ్మలు దగ్ధం

**భూపాలపల్లి, మహా :** భూపాలపల్లి జిల్లా కేంద్రంలో పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి .కెసిఆర్,మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి దిష్టిబొమ్మలను ఆదివారం దహనం చేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు విస్లావత్ దేవన్ మాట్లాడుతూ భూపాలపల్లి నియోజకవర్గం కోసం నిత్యం ప్రజలలో ఉండి అభివృద్ధియే లక్ష్యంగా పాటుపడే భూపాలపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని అన్నారు. తెలంగాణ రాష్టాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గాన్ని సత్యనారాయణ రావ్ అన్ని రంగాలలో దేశం లోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చి దిద్దుతుంటే రాబోయే స్థానిక ఎన్నికలలో ఏ విధంగా బి ఆర్ ఎస్ పార్టీకి ఓటు పడదని తెలిసి ఉనికి చాటుకోవడం కోసం నిన్న కొందరు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు రేవంత్ రెడ్డి, సత్తన్న దిష్టిబొమ్మ దహనం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. మీరు ఇంకొక సారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబొమని బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు చేసిన వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలని లేదంటే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రానున్న రోజుల్లో ప్రజలే ఎన్నికలలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు చల్లూరి మధు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బట్టు కర్ణాకర్, ఐఎంటియిసి బ్రాంచ్ ఉపాధ్యక్షులు బేతల్లి మధుకర్ రెడ్డి, సీనియర్ నాయకులు చల్లూరి సమ్మయ్య, మాజీ కౌన్సిలర్ లు దాట్ల శ్రీనివాస్, సజ్జనపు స్వామి, చల్ల రేణుక, పానుగంటి హారిక, పైడిపల్లి రమేష్, శ్రీనివాస్,బౌతు రాజేష్, పొనకంటి శ్రీనివాస్,బౌతు రమేష్, గురిజాల రవీందర్,మహేష్,సురేష్, మహిళ నాయకురాళ్లు మాలతి, పద్మావతి,కోమల, అంబాల శ్రీను,సాంబమూర్తి, ముంజాల రవీందర్,మహేష్‌రెడ్డి, నాగపురి సమ్మయ్య, సహదేవ్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# కాళోజీ కళాక్షేత్రానికి తాళం వేసిన కాంట్రాక్టర్

**కేసు నమోదు చేసి తాళం తీయించిన పోలీసులు**

**హన్మకొండ మహా;** రాష్ట్ర ప్రభుత్వం ఏడాది క్రితం అత్యంత ప్రతిష్టాత్మకంగా కాళోజీ కళాక్షేత్రాన్ని నిర్మాణం పూర్తి చేసుకొని సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అత్యంత వైభవంగా ప్రారంభమైన విషయం మనకందరికీ తెలిసిందే. కాగా ప్రభుత్వం నుంచి రావలసిన రూ.4 కోట్ల బిల్లులు ఇవ్వడం లేదని ఆదివారం హన్మకొండ బాల సముద్రంలోని కాళోజీ కళాక్షేత్రానికి కాంట్రాక్టర్ శ్రీకాంత్ రెడ్డి తాళం వేసారు. కాగా ఆదివారం నుండి రెండు రోజుల పాటు కాళోజీ కళాక్షేత్రంలో కాకతీయ నృత్య నాటకోత్సవ కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ కార్యక్రమాలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో సహా హాజరుకానున్న పలువురు మంత్రులు కార్యక్రమం కోసం వెళ్లగా, తాళం వేసి ఉండడంతో ఖంగుతిన్న అధికారులు కార్యక్రమాలు జరగకుండా తాళం వేసినందుకు కాంట్రాక్టర్ శ్రీకాంత్ రెడ్డి పై పోలీసులు కేసు నమోదు చేసి తాళం తీయించారు.

# ఘనంగా కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి కార్యక్రమం

**పాల్గొన్న నగర మేయర్ గుండు సుధారాణి**

**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా అఖిలభారత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నగర మేయర్ గుండు సుధారాణి తో కలిసి పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ లయన్ ఆడెపు రవీందర్ నేత కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత పద్మశాలి సంఘం వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ వడ్నాల నరేందర్, ప్రధాన కార్యదర్శి గోరంటాల్ రాజు, 23వ డివిజన్ అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు మంత్రి కమలాకర్, పద్మశాలి నాయకులు కుల పెద్దలు సహకార సంఘాల అధ్యక్షులు పద్మశాలి కుల బాంధవులు చేనేత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పసుపు వర్ణమైన శ్రీ భద్రకాళి అమ్మవారు

**వరంగల్ మహా;** వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానంలో అత్యంత వైభవోపేతంగా భక్తి ప్రపత్తులతో జరుపబడే శ్రీ దేవీ శరన్నవరాత్ర మహోత్సాలకు 21092025 ఆదివారం రోజున అంకురార్పణ జరిగినది. ఆదివారం ఉదయం అమ్మవారికి నిత్యాహ్నికం నిర్వహించిన అనంతరం జగత్ప్రసూతికా అలంకారణ జరిపి హరిద్రా అమ్మవారిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు సమర్పించిన 27 కిలోల స్వచ్ఛమైన హరిద్రా (పసుపు) చూర్ణంతో అమ్మవారికి హరిద్రాభిషేకం నిర్వహించారు. అంతకుముందు పూజారులు వైదికమైన క్రతువు నిర్వహించారు. మధ్యాహ్నం వరకు భక్తులందరూ దర్శించుకునే విధంగా అవకాశం కల్పించారు. అనంతరం అంకురార్పణ జరిగింది. పసుపుమయమై ఉన్న అమ్మవారిని దర్శించిన భక్తులు ఈ రోజు తమకు కలిగిన ఆనందానుభూతిని మాటల్లో వర్ణించలేమని తెలిపారు. జగత్ప్రసూతికా అలంకారం హరిద్రా దర్శనం నేపథ్యాన్ని శ్రీ భద్రకాళి శేషు భక్తులకు వివరించారు.

# దసరా సందర్భంగా ప్రజల భద్రత – జాగ్రత్తలతోనే సుఖశాంతులు

**భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే**

**భూపాలపల్లి, మహా :** దసరా పండుగ సమయానికి విద్యార్థులకు సెలవులు రావడంతో జిల్లా ప్రజలు గ్రామాలకు, ఇతర ప్రాంతాలకు ప్రయాణాలు చేస్తారు. ఇలాంటి వేళల్లో చోరీలు, దొంగతనాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజల భద్రత కొరకు పోలీసులు అదనపు గస్తీ ఏర్పాటు చేసి, క్రైమ్ విభాగం ద్వారా నిరంతర నిఘా కొనసాగిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని, చెరువులు, బావులు దగ్గర చిన్నారులు ఆడకుండా జాగ్రత్త వహించాలని సూచించారు.

**గ్రామాలకు కు వెళ్ళే వారికి పోలీసుల సూచనలు:**

ఇళ్ల పరిసరాలు, కాలనీలు, షాపింగ్ మాళ్లలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు అమర్చుకోవాలి. ఊరికి వెళ్లే వారు తమ పొరుగు వారికి మరియు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఇళ్ళు లాక్ వేసేటప్పుడు బీరువా తాళాలు ఇంట్లో వదిలి పెట్టరాదు. తాళం కనబడకుండా డోర్ కర్టెన్ వేయాలి. ఇంట్లో ఒక గదిలో లైటు వేసి ఉంచితే ఇల్లు ఖాళీగా లేదని భావిస్తారు. ఎక్కువ రోజులు విహారయాత్రలో ఉండే వారు పేపర్, పాల డెలివరీ ఆపనివ్వాలి. వాహనాలకు హ్యాండిల్ లాక్‌తో పాటు వీల్ లాక్ వేయాలి. వీధి లేదా బాహ్య ప్రాంగణంలో కాకుండా ఇంటి పరధిలోనే వాహనాలు నిలిపివేయాలి.విలువైన బంగారాన్ని, నగదును బ్యాంకు లాకర్లలో భద్రపరచాలి. లేకపోతే వెంట తీసుకెళ్ళడం మంచిది.ప్రయాణంలో బ్యాగులు ఎప్పుడూ దగ్గరలోనే ఉంచుకోవాలి; బస్సుల్లో పెట్టి నిర్లక్ష్యం చేయరాదు.అనుమానాస్పద వ్యక్తుల కదలికలు గమనించిన వెంటనే 100 లేదా భూపాలపల్లి పోలీస్ కంట్రోల్ రూం నంబర్ 8712658159 కు సమాచారం ఇవ్వాలి.



**సమాజ హితానికి కమిటీలు**

దొంగతనాల నివారణకు కాలనీలు, గ్రామాల్లో స్వచ్ఛంద కమిటీలు ఏర్పాటు చేసుకుని ఎప్పటికప్పుడు పోలీసులకు సహకారం అందించాలి. ప్రజల అప్రమత్తతతోనే సమాజంలో సుఖశాంతులు, భద్రతలు కొనసాగుతాయని జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఐపిఎస్ తెలిపారు.

# ప్రతిభ కళా సేవా బెస్ట్ సోషల్ యాక్టివిస్ట్ 2025 అవార్డు ప్రదానం

**కాటారం, మహా :** మండల కేంద్రంలోని గారేపల్లి గ్రామానికి చెందిన స్వయంకృషి స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్ కొట్టే సతీష్ కు ప్రతిభ కళా సేవా బెస్ట్ సోషల్ యాక్టివిస్ట్ 2025 అవార్డును ప్రధానం చేశారు. ఆదివారం ఫ్రెండ్ షిప్ మినిస్ట్రీస్ తెలంగాణ ఆధ్వర్యంలో హైదరాబాద్ లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సలహాదారులు దరువు అంజన్న మరియు సినీ నటులు, మా అసోసియేషన్ ఈసీ మెంబర్ మాణిక్ రావు చేతుల మీదుగా డాక్టర్ దాసరి నారాయణరావు స్మారక ప్రతిభ కళా సేవా బెస్ట్ సోషల్ యాక్టివిస్ట్ 2025 అవార్డును అందుకున్న స్వయంకృషి స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్ కొట్టే సతీష్ . గ్రామీణ ప్రాంతంలో నిరుపేద విద్యార్థిని విద్యార్థులకు వారు చేస్తున్న సేవలు, కరోనా సమయంలో వారు మరియు వారి టీం చేసిన సేవలకు సభా వేదికగా వచ్చిన వక్తలు స్వయంకృషి స్వచ్ఛంద సేవా సంస్థను కొనియాడారు. స్వచ్ఛంద సేవా సంస్థ సేవలను గుర్తించి ఈ అవార్డు అందజేస్తున్నట్టు సంస్థ నిర్వాహకులు తెలిపారు.




# పేద, నిరుపేదలకు సీఎం సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోంది

**భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు..**

**భూపాలపల్లి, మహా** ఖరీదైన వైద్యం చేయించుకోలేని పేద, నిరుపేదలకు సీఎం సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం మొగుళ్ళపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 69 మంది సీఎం రిలీఫ్ ఫండ్ లబ్దిదారులకు రూ.16,50,000 విలువైన చెక్కులను మొగుళ్ళపల్లి రైతు వేదికలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై అందజేశారు. శాయంపేట మండల కేంద్రంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 49 మంది సీఎం రిలీఫ్ ఫండ్ లబ్దిదారులకు రూ. 15,58,000 చెక్కులను అందజేశారు. చెక్కుల పంపిణీ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... పేద ప్రజలను ఆర్థికంగా ఆదుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు, ఖరీదైన వైద్యం చేయించుకోలేని పేద, నిరుపేదలకు సీఎం సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే అన్నారు. మానవతాదృక్పథంతో సీఎం రేవంత్ రెడ్డి దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికీ ఆర్థిక సహాయాన్ని మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



# ఏడిపించిన బంగారం

## వారంలో ఎంత పెరిగిందంటే..



దేశంలో బంగారం ధరలు గత వారం రోజులుగా స్థిరమైన పెరుగుదలను చూశాయి. కాలానుగుణ డిమాండ్, స్థూల ఆర్థిక అనిశ్చితి కారణంగా విస్తృత జాతీయ, ప్రపంచ ధోరణికి అనుగుణంగా పసిడ ధరలు ఎగిశాయి. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం వంటి నగరాలు సహా రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం 24 క్యారెట్ల బంగారం ధర గ్రాముకు రూ .11,215 వద్ద ఉంది. ఇది వారం క్రితం ఉన్న రూ .11,117 తో పోలిస్తే రూ .98 పెరిగింది. అంటే తులానికి (10 గ్రాములు) రూ.980 పెరిగి రూ.1,12,150 కి చేరింది. మరోవైపు 22 క్యారెట్ల బంగారం ధర గ్రాముకు రూ.90 పెరిగి రూ.10,190 నుంచి రూ.10,280కు చేరుకుంది. వారం రోజుల్లో తులం బంగారం ధర ఏకంగా రూ.900 పెరిగి రూ.1,02,800 లకు ఎగిసింది.

**పండుగ డిమాండ్ పెరుగుదలకు కారణం**

నవరాత్రి సీజన్ ప్రారంభం కావడంతో, దీపావళి కేవలం వారాల దూరంలో ఉండటంతో, స్థానిక ఆభరణాల వ్యాపారులు సాంప్రదాయ కొనుగోళ్లు లేదా పెట్టుబడులు పెట్టే వినియోగదారుల నుండి ఆసక్తి పెరిగినట్లు నివేదిస్తున్నారు. వివాహ సంబంధిత కొనుగోళ్లు, సాధారణంగా ఈ సమయంలో ప్రారంభమవుతాయి. ఇది కూడా డిమాండ్ ను పెంచుతుంది. ఈ ధరల పెరుగుదల తెలుగు రాష్ట్రాల్లో మాత్రమే కాదు. జాతీయంగా, ప్రధాన నగరాల్లో బంగారం పెరిగింది. ద్రవ్యోల్బణ ఆందోళనలు, కరెన్సీ హెచ్చుతగ్గుల మధ్య అంతర్జాతీయంగా బంగారం ధరలు పెరిగాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ప్రపంచ మార్కెట్ అస్థిరత మధ్య సురక్షితమైన స్వర్గధామ ఆస్తిగా బంగారాన్ని ఇన్వెస్టర్లు భావిస్తున్నారు.

# తిరిగి వచ్చేయండి.. భయంతో జీవించవద్దు: శ్రీధర్ వెంబు




అమెరికా ప్రభుత్వం హెచ్ 1బీ వీసా ఫీజును లక్ష డాలర్లు పెంచుతూ సంచలన నిర్ణయం తీసుకుంది. దీనిపై జోహో కార్పొరేషన్ వ్యవస్థాపకులు, సీఈఓ 'శ్రీధర్ వెంబు' స్పందించారు. దీనికి సంబంధించిన ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ''విభజన సమయంలో అన్నీ వదిలి భారతదేశానికి ఎలా రావాల్సి వచ్చిందో.. సింధీ స్నేహితుల నుంచి నేను చాలా విషయాలను విన్నాను. వారు తమ జీవితాలను తిరిగి నిర్మించుకున్నారు. సింధీలు భారతదేశంలో బాగానే ఉన్నారు. ఇప్పుడు అమెరికాలో.. హెచ్ 1బీ వీసాపై ఉన్న భారతీయుల వంతు వచ్చింది. చెప్పడానికి బాధగా ఉన్నప్పటికీ.. మన దేశానికి తిరిగి వచ్చేయండి. మీ జీవితాలను మళ్లీ పునర్నిర్మించుకోవడానికి ఐదేళ్ల కాలం పట్టవచ్చు. కానీ అది మిమ్మల్ని బలపరుస్తుంది. భయంతో జీవించవద్దు. ధైర్యంగా ముందుకు సాగండి. మీరు బాగానే ఉంటారు'' అని శ్రీధర్ వెంబు తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. శ్రీధర్ వెంబు పోస్టుపై నెటిజన్లు తమదైన రీతిలో స్పందిస్తున్నారు. ''వాస్తవాలు తెలియకుండా భయాన్ని వ్యాపింపజేస్తున్నారు. ఇప్పటికే హెచ్ 1బీ వీసాలో ఉన్న వ్యక్తులకు కొత్త నియమాలు వర్తించవు, కాబట్టి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కొత్త నియమాలు కొత్త హెచ్ 1బీ దరఖాస్తుదారులకు మాత్రమే'' అని ఒక యూజర్ పేర్కొన్నారు. బెంగాలీలు, పంజాబీల నుంచి మీరు చాలా విషయాలను విని ఉండవచ్చు. కానీ వారు ఇప్పుడు ఉన్న స్థితికి చేరుకోవడానికి దాదాపు మూడు తరాలు పట్టింది. ఇది అంత సులభం కాదని ఇంకొకరు అన్నారు. ఇలాంటి సవాళ్లు అప్పుడప్పుడు ఎదుర్కోవాల్సి వస్తుంది. స్వదేశానికి తిరిగి వచ్చి, జీవితాలను పునర్నిర్మించుకోవడానికి చాలా కృషి అవసరం. కానీ భారతదేశంలో అవకాశాలు మెండుగా ఉన్నాయని.. ధైర్యం, పట్టుదలతో, అభివృద్ధి చెందవచ్చని.. మరో యూజర్ శ్రీధర్ వెంబు మాటలతో ఏకీభవించారు.

# బంగారం ధర పెరిగినా.. డిమాండ్ తగ్గదు!



భారతీయులకు బంగారంపై మక్కువ కొంత ఎక్కువే. ఈ కారణంగానే పెళ్లిళ్లకు, పండుగలకు గోల్డ్ కొనేస్తూ ఉంటారు. దీంతో ఇండియా ప్రపంచంలోనే అతిపెద్ద బంగారం వినియోగదారులలో ఒకటిగా అవతరించింది. భారతీయ కుటుంబాలు సుమారు 24,000 టన్నుల బంగారాన్ని కలిగి ఉన్నట్లు అంచనా. ఇది ప్రపంచ కేంద్ర బ్యాంకుల మొత్తం బంగారం నిల్వల కంటే ఎక్కువ. అయితే ప్రస్తుతం ధరలు భారీగా పెరిగాయి?. రాబోయే దసరా, దీపావళి సమయంలో పసిడి కొనుగోళ్లు ఎలా ఉండబోతున్నాయనే విషయాన్ని నిపుణులు అంచనా వేశారు. భారతదేశంలో పండుగ సీజన్ మొదలైంది. బంగారం ధరలు రికార్డు స్థాయికి చేరాయి. ప్రస్తుతం ఇండియన్ మార్కెట్లో ఒక గ్రామ్ 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ. 11,000 దాటింది. కాగా గత సంవత్సరం ఇదే సమయంలో.. బంగారం ధర రూ.7,500 మాత్రమే!. దీన్ని బట్టి చూస్తే 12 నెలల్లో పసిడి ధర ఎంతలా పెరిగిందో అర్థం చేసుకోవచ్చు. ధరలు పెరిగినా.. డిమాండ్ తగ్గదు! మనదేశంలో మొదటిసారి 10 గ్రాముల బంగారం ధరలు లక్ష రూపాయలు దాటేసింది. ధర ఎంత పెరిగినా.. పండుగ సీజన్లో బంగారానికి డిమాండ్ పెరిగే సంకేతం ఉందని 'వరల్డ్ గోల్డ్ కౌన్సిల్' వెల్లడించింది. సెప్టెంబర్ 22 నుంచి జీఎస్టీ సంస్కరణలు అమలులోకి రానున్నాయి. ఇది ప్రజల బడ్జెట్‌లో కొంత మిగులును మిగిల్చే అవకాశం ఉంది. ఈ మిగులు బడ్జెట్ బంగారం కొనుగోలుకు దారితీసే అవకాశం ఉంది. బంగారం ధరలకు పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయి. ఇందులో రష్యా ఉక్రెయిన్ యుద్ధం, ఇరాన్‌ఇజ్రాయెల్‌పాలస్తీనా మధ్య మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు, భౌగోళిక రాజకీయాలు కొంత అస్తవ్యస్తంగా మారడం వల్ల.. ప్రపంచ దేశాల్లో భయం, అనిశ్చితి ఏర్పడింది. దీంతో కేంద్ర బ్యాంకులు మరింత బంగారం కొనుగోలు చేయడం ఆరంభించాయి.

# ఇల్లు కట్టుకోవడానికి కావలసిన మెటీరియల్స్



ఇదివరకు మనం ఇల్లు కట్టుకోవడానికి ఎలాంటి స్థలం ఎంచుకోవాలి?, ల్యాండ్ కొనేముందు.. గుర్తుంచుకోవాల్సిన విషయాలు ఏమిటి? అనే విషయాలను గురించి తెలుసుకున్నాం. ఇప్పుడు ఈ కథనంలో ఇల్లు కట్టుకోవడానికి కావాల్సిన మెటీరియల్స్ ఏవి అనే విషయాన్ని పరిశీలిద్దాం.. ఇల్లు కట్టుకోవడానికి ఏ మెటీరియల్స్ కావాలనే విషయం బహుశా చాలామందికి తెలిసే ఉంటుంది. అయినప్పటికీ కొంతమంది అవగాహన కోసం ఒకసారి పరిశీలిస్తే.. సిమెంట్, ఇసుక, ఇటుకలు, కంకర, ఇనుము, వాటర్ ప్రూఫ్ మెటీరియన్స్ అవసరమవుతాయి. ఇవి కాకుండా వైరింగ్ కోసం, ప్లంబింగ్ కోసం మెటీరియల్స్, టైల్స్ / మార్బుల్ / గ్రానైట్, ఉడ్, గ్లాస్ వంటివి అవసరం అవుతాయి. ఇంటీరియర్ డిజైన్ కోసం మీ అభిరుచిని బట్టి ఎలాంటి మెటీరియల్స్ కావాలనేది మీ ఛాయిస్.

**మెటీరియల్స్ ధరల విషయానికి వస్తే..**

ఇల్లు నిర్మాణానికి కావాల్సిన మెటీరియల్స్ ధరలు ప్రదేశాన్ని బట్టి మారుతూ ఉంటాయి. ధరలు గ్రామీణ ప్రాంతాల్లో ఒకలా.. నగరాల్లో ఇంకోలా ఉంటాయి. అయితే ధరలు ఎలా ఉన్నా.. జీఎస్టీ సవరణల కారణంగా అధిక ధరల నుంచి కొంత ఉపశమనం లభిస్తుంది. దీంతో ఖర్చులు కొంత తగ్గుముఖం పడతాయి.

**నిర్మాణ సామగ్రిపై కొత్త జీఎస్టీ**

- సిమెంట్, రెడీమిక్స్ కాంక్రీట్ (ఆర్ఎంసీ): గతంలో 28 శాతం జీఎస్టీ ఉండగా.. 18 శాతానికి తగ్గింది.
- టైల్స్, ఇసుక, ఇటుకలు: 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గింది.
- రంగులు, వార్నిష్: 28 శాతం నుంచి 18 శాతం తగ్గింది.
- మార్బుల్, గ్రానైట్: 12 శాతం ఉండగా.. 5 శాతానికి తగ్గింది.

రానున్న రోజుల్లో ఇల్లు కట్టుకోవడానికి ఎలాంటి టెక్నాలజీ ఉపయోగించవచ్చు?, వేగంగా ఇల్లు కట్టుకోవడం ఎలా?, ఇల్లు కట్టుకునేటప్పుడు ఖర్చులను తగ్గించుకునే మార్గాలు? వంటి ఆసక్తికరమైన విషయాలు తెలుసుకుందాం.

# అమ్మకాల్లో సరికొత్త రికార్డ్: 5 లక్షల మంది కొన్నారు!



భారతదేశంలో బజాజ్ చేతక్ లాంచ్ అయినప్పటి నుంచి ఐదు లక్షల అమ్మకాలను అధిగమించింది. నవంబర్ 2023లో 1,00,000 అమ్మకాల మైలురాయిని చేరుకున్న ఈ స్కూటర్.. తాజాగా 5,10,000 యూనిట్ల అమ్మకాలను నమోదు చేసింది. 2020లో ఇండియన్ మార్కెట్లో అరంగేట్రం చేసినప్పటి నుంచి బజాజ్ చేతక్ 46 నెలల్లో లక్ష యూనిట్ల అమ్మకాల మైలురాయిని చేరుకుంది. అయితే గడిచిన 10 నెలల కాలంలోనే 2.06 లక్షల కంటే ఎక్కువ సేల్స్ పొందగలిగింది. మొత్తం మీద ఐదు లక్షల సేల్స్ అధిగమించింది. దీన్నిబట్టి చూస్తే దేశీయ విఫణిలో ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ ఏ స్థాయిలో పెరుగుతోందో అర్థం చేసుకోవచ్చు. బజాజ్ చేతక్ అమ్మకాలు పెరగడానికి ప్రధాన కారణం.. ఇది 3001, 3501, 3502, 3503 అనే వేరియంట్లలో అందుబాటులో ఉండటం మాత్రమే కాకుండా, దేశవ్యాప్తంగా 3,800 కంటే ఎక్కువ టచ్‌పాయింట్‌లతో కూడిన సర్వీస్ నెట్‌వర్క్ కూడా అని తెలుస్తోంది. ఈ స్కూటర్లు లేటెస్ట్ డిజైన్ కలిగి.. 3 కిలోవాట్ బ్యాటరీ, 3.5 కిలోవాట్ బ్యాటరీ ఎంపికలో అబందుబాటులో ఉన్నాయి. దీని ప్రారంభ ధర రూ.99,900 (ఎక్స్ షోరూమ్).

# దేశం-విదేశం

## NATIONAL-INTERNATIONAL

# హెచ్1బీ వీసా ఫీజు పెంపుపై వైట్ హౌస్ కీలక ప్రకటన




**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్ 1 బీ వీసా వార్షిక రుసుమును లక్ష డాలర్లకు పెంచుతూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. అయితే, ఆ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్న తరుణంలో వైట్ హౌస్ కీలక ప్రకటన చేసింది. నేటి నుంచి హెచ్ 1బీ వార్షిక వీసా కోసం దరఖాస్తు చేసే ప్రతి వ్యక్తి లక్ష డాలర్లు (సుమారు రూ.83 లక్షలు) ఫీజు చెల్లించాల్సి ఉంది. అయితే, ఈ పెంపు కొత్తగా దరఖాస్తు చేసే విదేశీ ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తుందని తెలిపింది. ఇప్పటికే హెచ్ 1బీ వీసా ఉన్నవారికి తాజా పెంపు వర్తించదని తెలిపింది. అమెరికా అధ్యక్షుడు తాజాగా విడుదల చేసిన 'ప్రోక్లమేషన్ ఆఫ్ రెస్ట్రిక్షన్ ఆన్ ఎంట్రీ ఆఫ్ సర్టెన్ నాన్‌ఇమ్మిగ్రెంట్ వర్కర్స్' ప్రకటన ప్రకారం హెచ్ 1బీ వీసాలపై కీలకమైన పరిమితులు విధించింది. ట్రంప్ ఆదేశాలను అమలు చేసే యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ (CBP) అధికారికంగా మార్గదర్శకాలు విడుదల చేసింది. ఆ మార్గ దర్శకాల ప్రకారం.. హెచ్ 1 బీ వీసా పొందిన ఈ ఉద్యోగులకు మినహాయింపు ఇచ్చింది.

**మినహాయింపులు...**

అమెరికా పౌరుల జీవిత భాగస్వాములు, పిల్లలు. అమెరికాలో స్థిర నివాసం ఉన్న వ్యక్తులు. వ్యవసాయం, మాంసం ప్రాసెసింగ్, ప్యాకింగ్ హౌసులు, రవాణా వంటి రంగాల్లో పనిచేసే కార్మికులకు మినహాయింపు ఆరోగ్య సంరక్షణ రంగంలోకి వచ్చే ముఖ్యమైన విభాగాల్లో పనిచేసే ఉద్యోగులకు మినహాయింపు ఉంటుంది. ఈ నిబంధనలు అమెరికాకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్న కొత్త వీసా దారులకు మాత్రమే వర్తిస్తుంది. ఇప్పటికే దాఖలైన కానీ ఇంకా వీసా పొందని ధరఖాస్తు దారులకు మాత్రమే వర్తిస్తుంది.

## ఏమిటీ హెచ్-1బీ వీసా?


విదేశీ నిపుణులను అమెరికాలోని కంపెనీలు ఉద్యోగాల్లో నియమించుకోవడానికి వీలుగా 1990వ దశకంలో అమెరికా ప్రభుత్వం ఇమ్మిగ్రేషన్ చట్టం ద్వారా హెచ్–1బీ వీసాలను ప్రవేశపెట్టింది. ఈ వీసాలతో లక్షలాది మంది విదేశీయులు అమెరికాలో ఉద్యోగాలు సంపాదించారు. ఇక్కడే స్థిరపడ్డారు. క్రమంగా పౌరసత్వం కూడా పొందారు. హెచ్–1బీ వీసా దరఖాస్తు ఫీజు ప్రస్తుతం 2 వేల డాలర్ల నుంచి 5 వేల డాలర్ల (రూ.1.76 లక్షలు– రూ.4.40 లక్షలు) దాకా ఉంది. తొలుత మూడేళ్ల కాలానికి హెచ్–1బీ వీసా జారీ చేస్తారు. అవసరాన్ని బట్టి మరో మూడేళ్లు పొడిగిస్తారు. ఈ వీసాలతో అత్యధికంగా ప్రయోజనం పొందుతున్నది భారత నిపుణులే. ఆ తర్వాత చైనా నిపుణులు ఉంటున్నారు. భారత్‌లో ఇంజనీరింగ్ విద్య అభ్యసించిన విద్యార్థుల కల హెచ్–1బీ వీసా అంటే అతిశయోక్తి కాదు. దీని గురించి తెలియనివాళ్లు దాదాపు ఉండరు. సాధారణంగా హెచ్–1బీ వీసా దరఖాస్తు ఫీజుతోపాటు ఇతర రుసుములను కంపెనీలే భరిస్తాయి. ఇకపై దీనికోసం ఏటా ఒక్కో విదేశీ ఉద్యోగిపై రూ.88 లక్షలకుపైగా చెల్లించాల్సి రావడం అమెరికా సంస్థలకు పెనుభారమే. అది పరోక్షంగా విదేశీ ఉద్యోగులకు.. ముఖ్యంగా భారతీయులకు నష్టం చేకూర్చనుంది. కంపెనీల అవసరాలు తీర్చేలా అత్యధిక ప్రతిభాపాటవాలు ఉంటే తప్ప హెచ్–1బీ వీసాతో అమెరికాలో ఉద్యోగం పొందడం దుర్లభమేనని అంటున్నారు.

# తాలిబాన్‌లకు ట్రంప్ హెచ్చరిక

## బాగ్రామ్ ఇవ్వకపోతే అంతుచూస్తాం..



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా తాలిబాన్లపై మరింత ఒత్తిడిని పెంచారు. 2021లో అమెరికా వదిలివేసిన బాగ్రామ్ వైమానిక స్థావరాన్ని తిరిగి ఇవ్వాలని తాలిబాన్లను డిమాండ్ చేశారు. దీనిని అప్పగించని పక్షంలో చెడు పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. చైనా అణు స్థావరాల వ్యూహాత్మక స్థానాన్ని ఎదుర్కొనేందుకు ట్రంప్ ఈ ప్రయత్నం తప్పనిసరని భావించారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఒకప్పుడు ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా కార్యకలాపాలకు కేంద్రంగా ఉన్న బాగ్రామ్ వైమానిక స్థావరం స్వాధీనంపై సోషల్ మీడియాలో ట్రంప్ స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు. ఆఫ్ఘనిస్తాన్ ఆధీనంలో ఉన్న బాగ్రామ్ వైమానిక స్థావరాన్నియునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాకు తిరిగి ఇవ్వకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని ట్రంప్ పేర్కొన్నారు. రెండు మైళ్ల రన్‌వేను కలిగి ఉండి, గతంలో బీ52లు, బ్లాక్ హాక్స్‌లను కలిగిన ఈ స్థావరం పశ్చిమ చైనా నుంచి ఎదురయ్యే ముప్పును పర్యవేక్షించడంతో సహా అమెరికా వ్యూహాత్మక ప్రయోజనాలకు కేంద్ర బిందువుగా నిలిచింది. కాగా తాలిబాన్ అధికారులు ట్రంప్ హెచ్చరికను తిరస్కరించారు. బగ్రామ్ ఆఫ్ఘన్ నేల.. ఇది చైనా అవుట్‌పోస్ట్ కాదని ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ పేర్కొన్నారు. ఆఫ్ఘనిస్తాన్‌లోని అమెరికా ఎయిర్‌బేస్‌లలో బాగ్రామ్ ఎయిర్‌బేస్ ప్రధానమైనదిగా ఒకప్పుడు ఉండేది. అప్పట్లో 40 వేల మంది సైనికులతో పాటు సివిలియన్ కాంట్రాక్టర్లు కూడా అక్కడ పనిచేసేవారు. అయితే, పలు కారణాలతో 2021 జులైలో అమెరికా సైన్యం బాగ్రామ్ ఎయిర్‌బేస్‌ను ఖాళీ చేసింది. తరువాత అది తాలిబాన్ల వశం అయింది. బాగ్రామ్‌కు అతి దగ్గరలో చైనాలోని కాష్గర్ ప్రాంతంలో ఓ న్యూక్లియర్ సైట్ ఉందని చెబుతారు. తాజాగా చైనా న్యూక్లియర్ కార్యకలాపాలపై దృష్టిసారించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భావించారు. చైనాపై నిఘా పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ విషయాన్ని స్వయంగా ఆయనే వెల్లడించారు. బాగ్రామ్‌ను తిరిగి స్వాధీనం చేసుకుని, అక్కడినుంచి చైనాపై నిఘా ఉంచుతామని ట్రంప్ పేర్కొన్నారు. అయితే అమెరికాకు చెందిన ఉన్నతాధికారి ఒకరు మీడియాతో మాట్లాడుతూ.. బాగ్రామ్ ఎయిర్‌బేస్‌ను స్వాధీనం చేసుకునేందుకు ఎలాంటి ప్లాన్స్ లేవని, అది సాధ్యం అవుతుందని అనుకోవడం లేదన్నారు. ఇస్లామిక్ స్టేట్, అల్ ఖైదా తదితర ఉగ్ర సంస్థల నుంచి దానిని స్వాధీనం చేసుకోవడం చాలా కష్టమైన పని అన్నారు. ఇందుకోసం వందల సంఖ్యలో మిలటరీ దళాలు అవసరమవుతాయి. బాగ్రామ్ పునర్నిర్మించడానికి భారీ మొత్తంలో ఖర్చవుతుందన్నారు.




# ఇరాన్‌లో ఉపాధి పేరుతో మోసపోవద్దు

## యువతకు కేంద్రం హెచ్చరిక

**న్యూఢిల్లీ:** విదేశాల్లో మంచి ఉద్యోగం, అధిక జీతం అంటూ కొందరు ఏజెంట్లు చెప్పే మాటలను నమ్మవద్దని విదేశాంగ శాఖ హెచ్చరించింది. ముఖ్యంగా ఇరాన్‌లో ఉద్యోగాల పేరిట జరుగుతున్న భారీ మోసం, కిడ్నాప్‌ల పర్వం ఇటీవల బయటపడిన విషయాన్ని గుర్తు చేసింది. మాయ మాటలతో ఇరాన్‌కు రప్పించుకుని, ఆ తర్వాత కిడ్నాప్ చేసి వారి కుటుంబ సభ్యుల నుంచి భారీగా డబ్బులు డిమాండ్ చేస్తున్న నేరగాళ్ల ముఠాల బారిన పడవద్దని కోరింది. ఇరాన్ ప్రభుత్వం భారతీయులకు వీసా రహిత ప్రవేశాన్ని కేవలం పర్యాటక ప్రయోజనాల కోసం మాత్రమే కల్పించిందని స్పష్టం చేసింది. అయితే, నేరగాళ్లతో సంబంధాలున్న కొందరు ఏజెంట్లు ఇదే అదనుగా ఉద్యోగాల కోసం కూడా వీసా లేకుండా వెళ్లవచ్చని నమ్మిస్తున్నారని తెలిపింది. ఇలాంటి ఆఫర్ల పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలని కోరింది. తప్పుడు వాగ్దానాలు చేసే ఏజెంట్లు కిడ్నాపర్లతో కుమ్మక్కై ఉండే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

# గుజరాతీ మహిళ హత్యకేసులో యువకుని అరెస్ట్

**దక్షిణ కరోలినా:** దక్షిణ కరోలినాలో గుజరాతీ మహిళ హత్య కేసులో ఒక అనుమానితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సెప్టెంబర్ 16న గుజరాతీ మహిళ కిరణ్ పటేల్ మరణానికి దారితీసిన కాల్పుల సంఘటనతో సహా రెండు కాల్పుల సంఘటనలలో ప్రమేయం ఉన్న జైడాన్ మాక్ హిల్ (21)ను పోలీసులు అరెస్టు చేశారు. సెప్టెంబర్ 16న దక్షిణ కరోలినాలోని యూనియన్ కౌంటీలోని సౌత్ మౌంటైన్ స్ట్రీట్‌లోని ఒక యార్డ్‌లో చార్లెస్ నాథన్ క్రాస్బీ(67) అనే వృద్ధుడిని మృతిచెందిన స్థితిలో పోలీసులు గుర్తించారు. ఫాక్స్ న్యూస్ నివేదిక ప్రకారం అదే రోజు సాయంత్రం, కిరణ్ పటేల్ (49) పై డీడీస్ ఫుడ్ మార్ట్ పార్కింగ్ స్థలంలో కాల్పులు జరిగాయి. ఆమె తీవ్రంగా గాయపడి మృతిచెందింది. గో ఫండ్‌మీ పేజీలోని వివరాల ప్రకారం ఈ ఘటన సెప్టెంబర్ 16న రాత్రి 10:30 గంటలకు జరిగింది. ఆ సమయంలో కిరణ్ పటేల్ యూనియన్ కౌంటీలో గ్యాస్ స్టేషన్‌కమ్‌కన్వీనియన్స్ స్టోర్ రిజిస్టర్ వద్ద నగదు లెక్కిస్తున్నారు. హిల్ ఆమె వద్దకు వచ్చి, క్యాష్ రిజిస్టర్ లాక్కున్నాడు. ఆమె అతనికి నగదు ఇచ్చే లోపుగానే అతను కిరణ్ పటేల్‌పై కాల్పులు జరిపాడు. అతనిని అడ్డుకునేందుకు కిరణ్ పటేల్ అతనిపైకి ప్లాస్టిక్ బాటిల్ విసిరి పరిగెత్తింది. హిల్ కూడా ఆమె వెంట పరిగెత్తాడు. ప్రాణాలను కాపాడుకునేందుకు పార్కింగ్ స్థలం వైపు పరిగెత్తిన కిరణ్ పటేల్ పై హిల్ కాల్పులు కొనసాగించాడు. ఆమెకు బుల్లెట్ తగిలి, తీవ్రంగా గాయపడి స్పృహ కోల్పోయింది. తరువాత అతను ఆమె దగ్గరకు వచ్చి మరోమారు కాల్పులు జరిపాడు. కేసు దర్యాప్తు చేపట్టిన సౌత్ కరోలినా లా ఎన్‌ఫోర్స్‌మెంట్ డివిజన్ అధికారులు అరెస్ట్ వారెంట్‌తో సౌత్ చర్చి స్ట్రీట్‌లోని హిల్ ఇంటికి చేరుకున్నారు. అయితే హిల్ వారిని ప్రతిఘటించాడు. ఎట్టకేలకు పోలీసులు హిల్‌ను అరెస్ట్ చేసి, హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





# 'మీ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా'..

## ఐకాన్ స్టార్ స్పెషల్ విషెస్

కోలీవుడ్ డైరెక్టర్ అట్లీకి ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ శుభాకాంక్షలు తెలిపారు. ఇవాళ ఆయన పుట్టినరోజు కావడంతో సోషల్ మీడియా వేదికగా విషెస్ తెలిపారు. ఈ మేరకు అల్లు అర్జున్ ట్వీట్ చేశారు. ఇలాగే మీరు మరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. అల్లు అర్జున్ తన ట్వీట్ లో రాస్తూ..'మై డియరెస్ట్ డైరెక్టర్ అట్లీకి పుట్టినరోజు శుభాకాంక్షలు. మీపై మా ప్రేమ ఎల్లప్పుడు ఉండాలి. ఈ ప్రత్యేక రోజున మీకు ఆనందం, ప్రేమ, శ్రేయస్సు కలగాలని కోరుకుంటున్నా. మీరు దర్శకత్వంలో రానున్న సినిమాటిక్ మ్యాజిక్‌ను అందరూ ఆస్వాదించే వరకు వేచి ఉండలేకపోతున్నా' అంటూ పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఐకాన్ స్టార్ చేసిన ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. కాగా.. తొలిసారి అట్లీ అల్లు అర్జున్ కాంబోలో వస్తోన్న సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీకి వర్కింగ్ టైటిల్ ఏఏ22 పేరును ఖరారు చేశారు. ఇటీవలే ఈ చిత్రం ముంబైలో షూటింగ్ షెడ్యూల్ పూర్తి చేసుకుంది. ఈ మూవీని అత్యంత భారీ బడ్జెట్‌తో సన్‌పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా కోసం సరికొత్త టెక్నాలజీలను ఉపయోగిస్తున్నామని దర్శకుడు అట్లీ ఇప్పటికే వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్‌ను హాలీవుడ్ రేంజ్‌లో తెరకెక్కిస్తున్నారు.

# రామ్‌చరణ్‌తో జోడీ?

హీరో రామ్‌చరణ్‌కి జోడీగా బాలీవుడ్ హీరోయిన్ కృతీ సనన్ నటించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. ప్రస్తుతం బుచ్చిబాబు దర్శకత్వంలో 'పెద్ది' అనే పాన్‌ఇండియా సినిమాలో నటిస్తున్నారు రామ్‌చరణ్. ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. శివరాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేంద్రు శర్మ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. 2026 మార్చి 27న ఈ చిత్రం విడుదల కానున్న సంగతి తెలిసిందే.

'పెద్ది' తర్వాత సుకుమార్ దర్శకత్వంలో నటించనున్నారు రామ్‌చరణ్. 'ఆర్‌సీ 17' అన్నది వర్కింగ్ టైటిల్. 'రంగస్థలం'(2018) వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత రామ్‌చరణ్-సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందనున్న సినిమా ఇది. ప్రస్తుతం ఈ మూవీ ప్రీ ప్రోడక్షన్ పనుల్లో బిజీ బిజీగా ఉన్నారు సుకుమార్. 'పెద్ది' షూటింగ్ పూర్తయిన వెంటనే ఏమాత్రం విరామం లేకుండా 'ఆర్‌సీ 17'ని సెట్స్‌కి తీసుకెళ్లనున్నారట రామ్‌చరణ్-సుకుమార్. అయితే ఈ సినిమాలో హీరోయిన్ ఎవరు? అనే విషయంపై ఇప్పటి వరకూ ఎలాంటి ప్రకటన రాలేదు.

అయితే రామ్‌చరణ్‌కి జోడీగా కృతీసనన్‌ని తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నారట సుకుమార్. మహేశ్ బాబు హీరోగా నటించిన 'వన్: నేనొక్కడినే' సినిమా ద్వారా కృతీసనన్‌ని తెలుగుకి పరిచయం చేశారు సుకుమార్. ఆ తర్వాత 'దోచెయ్, ఆదిపురుష్' వంటి తెలుగు సినిమాల్లో నటించారు కృతీసనన్. ప్రస్తుతం బాలీవుడ్‌లో బిజీగా ఉన్న ఈ బ్యూటీని 'ఆర్‌సీ 17' ద్వారా మరోసారి టాలీవుడ్‌కి తీసుకురానున్నారట సుకుమార్. మరి రామ్‌చరణ్‌కి జోడీగా కృతీసనన్ నటిస్తారా? లేదా? అనే విషయం తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాలి.





# ట్రైలర్ రెడీ

రిషబ్ శెట్టి హీరోగా నటించి, స్వీయ దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'కాంతార: చాప్టర్ 1'. ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటించగా, గుల్షన్ దేవయ్య, జయరాం ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. హోంబలే ఫిలింస్ నిర్మించిన ఈ చిత్రం ట్రైలర్‌ను రేపు (సెప్టెంబరు 22) రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ వెల్లడించి, ఓ కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. కాగా ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ను ప్రభాస్, హిందీ ట్రైలర్‌ను హృతిక్ రోషన్, తమిళ ట్రైలర్‌ను శివకార్తికేయన్, మలయాలం ట్రైలర్‌ను పృథ్వీరాజ్ సుకు మారన్‌లు డిజిటల్‌గా విడుదల చేయనున్నారు. ''ఈ సినిమా కోసం 3వేలమంది ప్రజలు, 500 మంది యోధులు పాల్గొన్న ఓ భారీ యుద్ధ సన్నివేశాన్ని తెరకెక్కించాం. ఇందుకోసం 25 ఎకరాల స్థలంలో ఓ పట్టణాన్ని నిర్మించి, దాదాపు 50 రోజుల పాటు షూటింగ్ చేశాం. భారతీయ సినిమా చరిత్రలోనే అతి పెద్ద సన్నివేశాల్లో ఈ యుద్ధ సన్నివేశం ఒకటిగా నిలుస్తుంది. 'కాంతార' ('కాంతార' సినిమాకు ప్రీక్వెల్‌గా 'కాంతార: ఛాప్టర్ 1' చిత్రం తెరకెక్కింది) విజయాన్ని కొనసాగించడంలో హోంబలే ఫిలింస్ రాజీ పడటం లేదు. ఆడియన్స్‌కు థియేటర్స్‌లో గొప్ప అనుభూతిని ఇచ్చేలా ఈ సినిమా ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. కన్నడతో పాటు హిందీ, తెలుగు, మలయాళ, తమిళ, బెంగాలీ, ఇంగ్లిష్ భాషల్లో 'కాంతార: ఛాప్టర్ 1' చిత్రం అక్టోబరు 2న థియేటర్స్‌లో రిలీజ్ కానుంది.



# మీ బుద్ధి మార్చుకుంటే మంచిది: హీరోయిన్ కౌంటర్

కొందరు నటీమణులను చూస్తే వీరికి వయసు పెరగదా? అనిపిస్తుంది. అలాంటి వారిలో వేదిక ఒకరు. ఈ మహారాష్ట్ర బ్యూటీ వయసు ఇప్పుడు 37 ఏళ్లు. అయినప్పటికీ ఇప్పటికీ పదహారేళ్ల పడుచుపిల్లలాగే కనిపిస్తుంది. తమిళం, తెలుగు, మలయాళం, కన్నడం, హిందీ భాషల్లో హీరోయిన్‌గా నటిస్తూ తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. అయితే ఇప్పటికీ స్టార్ హీరోయిన్ స్టేటస్ కోసం కష్టపడుతూనే ఉంది. తమిళంలో ముని, సక్కరకట్టి, కాళై, పరదేశీ, కావియ తలైవన్, కాంచన–3 వంటి చిత్రాల్లో నటించిన వేదిక ఇప్పటికీ తన సొగసులతో ప్రేక్షకులను అలరిస్తూనే ఉంది. తాజాగా కొన్ని విమర్శలు ఈ బ్యూటీకి కోపం తెప్పించాయి. గ్లామరస్‌గా కనిపిస్తే చాలు వేలెత్తి చూపడానికి రెడీ ఉంటారని ఆగ్రహించింది. సాధారణంగానే హీరోయిన్లు అంటే విమర్శలు గుప్పించడానికి ఒక వర్గం రెడీగా ఉంటుందని, అందులోనూ కాస్త గ్లామరస్ దుస్తులు ధరిస్తే ఏకంగా వారి క్యారెక్టర్‌నే తప్పపడుతున్నారని మండిపడింది. దుస్తుల గురించి విమర్శించే దుస్థితి మారాలంది. తానూ బికినీ ధరించి కూడా నటిస్తానని, ఇలాంటి విమర్శలను అస్సలు పట్టించుకోనని చెప్పింది. తానేమిటో తనకు బాగా తెలుసని, తప్పడు బుద్ధి కలవారు మారితే మంచిదని వేదిక పేర్కొంది. ప్రస్తుతం ఈ హీరోయిన్ తెలుగు, తమిళం, కన్నడం భాషల్లో ఒక్కో చిత్రం చేస్తోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com